

యూనివర్సిటీ భవనం..

## మొదటి వారంలో
# ముహూర్తం!

- ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం డిసెంబరులో
- సీఎం చేతులమీదుగా వేడుక నిర్వహణకు ఏర్పాట్లు
- అధికారికంగా ఆహ్వానం పలికిన మంత్రి తుమ్మల
- సిద్ధంగా ఉండాలంటూ అధికారులకు ఆదేశాలు

కొత్తగూడెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచస్థాయిలో ఆదర్శంగా నిలిచేలా తలపెట్టిన మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అధికారిక ప్రారంభోత్సవానికి డిసెంబరు మొదటివారంలో ముహూర్తం ఖరారైంది. యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానం పలికారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఖచ్చితంగా జిల్లా పర్యటనకు వస్తానని హామీ ఇచ్చారు. డిసెంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు అనుకూలమైన రోజు నిర్ణయించుకుని తెలియజేస్తానని తెలపిన క్రమంలో ( మిగతా 6వ పేజీలో )



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

## పేదలకిచ్చిన ప్రతీ మాటను
# నెరవేర్చేందుకు పనిచేస్తున్నాం

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ఖమ్మం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకిచ్చిన ప్రతీ మాటను నెరవేర్చేందుకు తమ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని గూడురుపాడు గ్రామంలో మంగళవారం సాయంత్రం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గూడురుపాడుకు రూ.8.50కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేశామన్నారు. పేదలకు ఇళ్లు అందించాలనే ఆలోచన గత పాలకులకు రాలేదని, కానీ ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసిందన్నారు. పిల్లలకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో గురుకులాల్లో 40శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచడం జరిగిదన్నారు. పేదల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ప్రత్యేకాధికారి రమేష్, ఆర్డీవో నరసింహరావు, తహసీల్దార్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మకానికి లోడ్ చేస్తున్న సుబాబుల్ కర్ర

## 'కర్ర' రైతులకు..
# కలిసొచ్చిన కాలం



- నిలకడగా సుబాబుల్, జామాయిల్ గిట్టుబాటు ధరలు
- నష్టాల నుంచి గట్టెక్కుతున్న కర్షకులు
- సాగుపై మళ్లీ పెరుగుతున్న ఆసక్తి
- జిల్లాలో సుమారు 1.20లక్షల ఎకరాల్లో పెంపకం

"**వాణిజ్య పంటల సాగు** బాటలో రైతులు అలసిపోతున్నారు. వరుసగా వస్తున్న ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల బెడదతో కాలం కలిసి రాక నష్టాలను చవిచూస్తున్నారు. మరోవైపు పెట్టుబడులు పెరగడం, కూలీల కొరతతో ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారు. చివరకు పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కోలుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో 'కర్ర' రైతులు ఈ ఏడాది కొంత మెరుగ్గా ఉన్నారు. సుబాబుల్, జామాయిల్ కర్రకు ఈ ఏడాది గిట్టుబాటు ధరలు బాగానే ఉండటం.. అవి కూడా నిలకడగా ఉండటంతో సాగుపై కర్షకులు ఆసక్తి చూపుతున్నారు."

■ బోనకల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి )

అటవీ పంటలుగా పేరున్న సుబాబుల్, జామాయిల్ సాగు రైతులకు కలిసి వస్తోంది. వారికి ఈ ఏడాది మంచి లాభాలను తెచ్చిపెడుతోంది. పేపర్ మిల్లులకు డిమాండ్ పెరగడం, దానికి తగినంతగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కర్ర సరఫరా లేక పోవడం వలన ప్రస్తుతం కర్రకు డిమాండ్ పెరగడంతో పాటు ధరలు కూడా పెరిగాయి. ఖమ్మం జిల్లాలో దాదాపు 1.20 లక్షల ఎకరాల్లో సుబాబుల్, జామాయిల్‌ను రైతులు సాగు చేస్తున్నారు. తక్కువ శ్రమతో పాటు కూలీల కొరతను అధిగమిస్తూ, తక్కువ పెట్టుబడులతో దీర్ఘకాలిక పంటగా వేస్తున్నారు. పంట వేసిన తరువాత తొలి ఏడాది అంతర పంటల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు. నీటి లభ్యతను బట్టి పంట వేసిన రెండు ఏళ్ల నుంచి కర్ర కటింగ్‌కు వస్తుంది. ఎకరంలో 5 నుంచి 7 సార్లు వరకు అంటే పదేళ్లకుపైగా కర్ర కటింగ్‌కు వస్తూనే ఉంటుంది. ప్రతీ విడత కటింగ్‌కు ఎకరానికి 25 నుంచి 40 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

### నిలకడగా ధరలు..

సుబాబుల్, జామాయిల్ కర్రకు గిట్టుబాటు ధరలు నిలకడగా ఉండటంతో ఆ కర్ర సాగు చేస్తున్న రైతులు క్రమంగా వాణిజ్య పంటల సాగులో చవిచూసిన నష్టాల నుంచి గట్టెక్కుతున్నారు. ప్రస్తుతం సుబాబుల్ ముడి కర్ర టన్ను ధర రూ.6వేలు ఉండగా, డిబార్క్ చేసిన కర్రకు రూ.8వేల వరకు ధర పలుకుతోంది. జామాయిల్ డిబార్క్ కర్ర టన్ను ధర రూ.7వేలు ఉంది. భద్రాద్రి జిల్లాలోని సారపాకలో గల ఐటీసీ, కొమరంభీం జిల్లాలోని సిర్పూర్ కాగజ్ నగర్, ఆంధ్రాలోని రాజమండ్రి, మహారాష్ట్రలోని బల్లార్షాలోని పేపర్ మిల్లులకు రోజువారీ 30వేల టన్నుల కర్ర అవసరం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో రోజువారీ కేవలం పది వేల టన్నులకు మించి కర్ర సరఫరా కాక పోవడంతో విదేశాల నుంచి కూడ కర్ర దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల దృష్ట్యా పేపర్ మిల్లులకు కర్ర కొరత వలన ధరలు పెరిగాయి. రైతులకు మార్కెటింగ్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యాపారులే పొలాల వద్దకు వచ్చి కర్రను నేరుగా కొనుగోలు చేస్తున్నారు. ఎకరం సుబాబుల్ పొలం సాగు ద్వారా దాదాపు రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుంది. రెండేళ్లకు కటింగ్ వస్తే ఏడాదికి రూ.లక్ష వరకు ఆదాయం ఉంటుంది. రైతులందరూ ఒకే రకమైన పంటలను సాగు చేస్తే ఉత్పత్తి పెరిగి ధరలపై ప్రభావం పడి గిట్టుబాటు ధరలు ఉండటం లేదు. మరో రెండేళ్ల పాటు కర్ర రైతులకు గిట్టుబాటు ధరలు ఇదే రీతిలో ఉండే అవకాశం ఉండటంతో అందరి చూపు కర్రసాగువైపే ఉంది.



'సుబాబుల్'లో కర్ర నరుకుతున్న కూలీలు

### ప్రభుత్వం డ్రిప్ అవకాశాన్ని కల్పించాలి



**వట్టికొండ శ్రీను ( రాష్ట్ర సుబాబుల్, జామాయిల్ రైతుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు )**

కర్రసాగుకు సంబంధించి యువ రైతులను ప్రోత్సహించే విదంగా ప్రభుత్వం డ్రిప్ అవకాశాన్ని కల్పించాలి. సబ్సిడీ ద్వారా డ్రిప్ పరికరాలను అందజేయాలి. మరో రెండేళ్ల పాటు ధరలకు ఢోకా లేకపోయినా ఆ తరువాత మాత్రం పతనమయ్యే అవకాశం ఉంది. భవిష్యత్ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం కర్ర కోసం పేపర్ మిల్లులు పోటీ పడుతుండటం వల్ల ఆశాజనకమైన ధరలు ఉన్నాయి. ఇది సంతోషకరం.

# సీతారామను సత్వరమే పూర్తిచేయాలి

- వీలైనంత త్వరగా సాగునీరు ఇవ్వాలి
- ముగ్గురు మంత్రులు విభేదాలు వీడి అభివృద్ధికి కృషిచేయాలి
- జమలాపురం ఆలయానికి నిధులు కేటాయించాలి
- 42శాతంరిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ బీసీలకు ద్రోహం చేస్తోంది
- ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి
- కమ్యూనిస్టులతో కలిసి నడుస్తా.. జిల్లా సమస్యలపై పోరాడతా..
- తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- జిల్లాలో ముగిసిన జనంబాట కార్యక్రమం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కవిత

ఖమ్మం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సీతారామ ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేసి ఉమ్మడి జిల్లా భూములకు సాగునీరు ఇవ్వాలని, ముగ్గురు మంత్రులు విభేదాలు వీడి అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా రెండురోజుల పాటు ఆమె ఖమ్మం జిల్లాలో పర్యటించారు. తొలిరోజు సోమవారం ఆదివారం రాత్రి మధిర చేరుకున్న కవిత సోమవారం ఉదయం జమలాపురం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని తన పర్యటన ప్రారంభించారు. అనంతరం మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో పర్యటించారు. ఇక రెండోరోజైన సోమవారం ఆమె ఖమ్మం, ఖమ్మం రూరల్ మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడతానని, అవసరమైతే కమ్యూనిస్టు పార్టీలతో కలిసి ప్రయాణిస్తానన్నారు. తాను పార్టీ పెట్టాలనుకుంటే ప్రజలకు వజ్రాయుధంలాంటి పార్టీ పెడతానని, కానీ ప్రస్తుతానికి ( మిగతా 6వ పేజీలో )

**తుమ్మలను వదులుకోవడం వల్లే బీఆర్ఎస్ ఓటమిపాలైంది**

'అనుభవజ్ఞుడైన తుమ్మలనాగేశ్వరావును వదులుకోవడం వల్లే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైంది. నాడు కేసీఆర్ సీనియర్లను వదులుకుని పెద్ద తప్పు చేశారు. ఎన్నికలకు ముందు తుమ్మల లాంటి సీనియర్ నేతను వదులుకోవడంతో ఆ ప్రభావం రాష్ట్రమంతా చూపింది. అలాగే పలువురు కీలక నేతలనూ వదులుకోవడం బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టం చేకూర్చింది. మూడోసారి ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి పాలవ్వాల్సి వచ్చింది' అని కవిత వ్యాఖ్యానించారు.

## మహిళా సంఘ సభ్యులకు..
# ఉచితంగా చీరలు

- నేడు రఘునాథపాలెంలో పంపిణీకి శ్రీకారం చుట్టనున్న మంత్రి తుమ్మల
- గ్రామాలకు 2,41,512, పట్టణాలకు 56,400 చీరలు

6



శోభాయమానంగా
## గిరిప్రదక్షిణ

స్తంభాద్రి లక్ష్మీనృసింహుడికి వైభవంగా పల్లకీసేవ 7





తేనేటీగల పెంపకం యూనిట్‌ను ప్రారంభిస్తున్న సౌమ్యమిశ్రా

## ఖైదీల్లో సత్ప్రవర్తనకు
# విప్లవాత్మక చర్యలు

- జైళ్లు-సంస్కరణల విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా
- జిల్లా జైలులో తేనెటీగల పెంపకం ప్రారంభం
- ఇల్లెందులో సబ్‌జైలు తనిఖీ

7

## భద్రాద్రి చేరుకున్న జైళ్లశాఖ డీజీ

- నేడు అగర్‌బత్తీల తయారీ యూనిట్‌కు శ్రీకారం

భద్రాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ప్రత్యేక సబ్‌జైల్లో బుధవారం హెర్బల్ అగర్‌బత్తిల తయారీ యూనిట్‌ను జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా ప్రారంభించనున్నారు. ఇందుకోసం మంగళవారం రాత్రి ఆమె బూర్గంపాడు మండలంసారపాక ఐటీసీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు భద్రాచలం ప్రత్యేక సబ్‌జైలు సూపరింటెండెంట్ జె.ఉపేందర్ పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. భద్రాచలం ప్రత్యేక సబ్‌జైల్లోని అండర్ ట్రయల్, రిమాండ్ ఖైదీలతో నిర్వహించనున్న ఈ అగర్‌బత్తీల యూనిట్‌కు అవసరమైన యంత్రాలను ఇప్పటికే కరీంనగర్ నుంచి తెప్పించారు. బుధవారం ఉదయం ఆమె భద్రాద్రి రామయ్యను దర్శించుకొని అనంతరం అగర్‌బత్తీల తయారీ యూనిట్‌ను ప్రారంభించి.. అండర్ ట్రయల్, రిమాండ్ ఖైదీలతో ముచ్చటిస్తారు.

# ఇదేం లాజిక్?


- ఐదు కిలోల చెక్కెర పొంగలికి రూ.2వేలు చెల్లిస్తే 32 కేజీల ప్రసాదమిస్తారట
- ఎస్‌పీఎఫ్ సిబ్బంది తనిఖీలో వెలుగులోకి
- భద్రాద్రి రామాలయంలో ఘటన
- దిట్టం ప్రకారం ప్రసాదం అందజేశాం : ఈవో

■ భద్రాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి )

దక్షిణ అయోధ్య భద్రాద్రిలో చెక్కెర పొంగలి ప్రసాదం విక్రయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఐదుకేజీల చెక్కర పొంగలికి రూ.2వేలు చెల్లించిన భక్తుడికి ఏకంగా 32కిలోల పొంగలి ప్రసాదం ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే దీనిపై దేవస్థానం వారు చెబుతున్న లెక్కలు చూసిన వారు అసలు ఇదేం లాజిక్ అని ముక్కున వేలేసుకున్నారు. ఇదే రామాలయంలో మంగళవారం 32 కిలోల పొంగలిని సిద్ధం చేసిన అనంతరం భక్తుడికి సంబంధించిన వారు ఆ ప్రసాదాన్ని తీసుకెళ్తుండగా అనుమానం వచ్చిన ఎస్‌పీఎఫ్ సిబ్బంది తనిఖీ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అయితే తాము 5కేజీల ప్రసాదానికి రూ.2వేలు చెల్లించి తీసుకెళ్తున్నామని వారు చెప్పడంతో ఎస్‌పీఎఫ్ సిబ్బంది దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. దీంతో అధికారులు మరోసారి పరిశీలించి ఇందులో ఎలాంటి లోపం లేదని పేర్కొనడంతో ఆ పొంగలి ప్రసాదాన్ని సంబంధిత వ్యక్తులు తీసుకెళ్లారు.

### ఇదెలా సాధ్యం?

రామాలయంలో విక్రయించే చెక్కెర పొంగలి ఒక కిలోకు రూ.400చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొంత మంది భక్తులు దీనిని బోగంగా (స్వామివారికి నివేదిన చేసి ఇచ్చేది) భావిస్తారు. మరికొందరు స్వామి వారి ప్రసాదంగానే భావిస్తూ నేరుగా మొత్తం నివేదన లేకుండా తీసుకుంటారని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో మంగళవారం జరిగిన ఘటనలో సదరు భక్తుడు ఐదుకేజీలకు రూ.2వేలు చెల్లించారు. ఈ లెక్కన ఆయనకు ఐదు కిలోల ప్రసాదాన్ని దేవస్థానం వారు ఇవ్వాల్సి ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. కానీ దేవస్థానం అధికారులు మాత్రం దిట్టం అనుగుణంగా మొత్తం ప్రసాదం వారికే చెందుతుందని పేర్కొంటుండటం గమనార్హం. ఒక కిలో ప్రసాదం తయారీకి ఒక కేజీ బియ్యం, 1.5కిలోల చెక్కెర, 250గ్రాముల పెసర పప్పు, 350 గ్రాముల నెయ్యి, కిస్మిస్ 50 గ్రాములు, జీడిపప్పు 50గ్రాములు, రెండు గ్రాముల యాలకులు దిట్టంలో (మిగతా 6వ పేజీలో)



32కిలోల చెక్కెర పొంగలి

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో
# భద్రాద్రి జిల్లాకు ఐదు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో పరందామరెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో భద్రాద్రి జిల్లాకు ఐదు పతకాలు వరించడం హర్షించదగ్గ విషయమని డీవైఎస్‌వో పరందామరెడ్డి అన్నారు. మంగళవారం డీవైఎస్‌వో కార్యాలయంలో పతకాలు పొందిన ఐదుగురు క్రీడాకారులను ధృవపత్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో ముగిసిన రాష్ట్ర స్థాయి సీనియర్స్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో జిల్లా రెజ్లింగ్ జట్టు ప్రాతినిధ్యం వహించి పలు విభాగంలో పలువురు జాతీయ స్థాయి క్రీడాకారులతో తలబడి అత్యంత ప్రతిభ కనబర్చారు. ఎ.వెంకటప్రసాద్(వెండి పతకం), సంధ్య(వెండి), పి.నందిని, ఐ.అనుప్రియ, ఐ.సోనియాలకు(కాంస్యం)లు గెలుపొందారు. చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని, తద్వారా క్రీడాకారులుగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకువస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా రిజర్వేషన్ పొంది బంగారు భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాశీ హుస్సేన్, గౌరవ అధ్యక్షులు నాగ సీతారాములు, ఉపాధ్యక్షులు ఐ.ఆదినారాయణ, తిరుమలరావు, ఫిజికల్ డైరెక్టర్ డి.శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక ఉర్సే షరీఫ్

» నేటి నుంచి వేడుకలు ప్రారంభం

ఇల్లెందు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా గత రెండు దశాబ్దాలకు పైగా ప్రతిఏటా వైభవంగా ఇల్లెందు మండలం సత్యనారాయణపురం అటవీప్రాంతంలోని హజరత్ నాగుల్‌మీరా మౌలాచాన్ దర్గాలో నిర్వహించే ఉర్సెషరీఫ్ వేడుకలు నేటి నుంచి రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 19, 20 తేదీల్లో కులమతాలకు అతీతంగా జరగనున్న ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. 23వ ఉర్సెషరీఫ్ ఉత్సవాల సందర్భంగా 19న సాయంత్రం ఇల్లెందు పట్టణంలోని నెం.2బస్తీలోగల హజరత్



భక్తుల పూజలు అందుకోనున్న నాగుల్ మీరా



శోభాయమానంగా దర్గా ప్రాంగణం

ఖాసీం దుల్హా దర్గా షరీఫ్ నుంచి చాదర్‌ను తీసుకురావడం జరుగుతుందని మాలిక్‌లు తెలిపారు. సాయంత్రం సందల్(గంధం) కార్యక్రమం నిర్వహించిన పిదప హజరత్ నాగుల్‌మీరా దర్గాకు తీసుకువెళ్లి పూజలు జరపడం ద్వారా ఉర్సె షరీఫ్ ఉత్సవాలు ప్రారంభిస్తారు. 20న ఇల్లెందు పట్టణంలోని నెంబర్ 2బస్తీలోగల హజరత్ దర్గా షరీఫ్ నుంచి భారీ జులుస్ వేడుకలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. సాయంత్రం సత్యనారాయణపురంలోని మౌలాచాన్ దర్గాలో ప్రత్యేక పూజలు, కవ్వాలి కార్యక్రమాలు నిర్వహించేందుకు వేడుకల ప్రాంగణాలను శోభాయమానంగా అలంకరించారు.

# టీచర్లలో..టెట్ గుబులు!




» సిలబస్, అర్హత మార్కులపై సీనియర్లకు తప్పని తిప్పలు
» ఉపాధ్యాయులకు 'పరీక్ష'ల కాలం
» ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల
» వెబ్‌సైట్లో పేపర్-1 పై బీఈడీ టీచర్లకు స్పష్టత

బోనకల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం.. విద్యార్థులు శ్రద్ధగా విని చదువుకోవడం.. పరీక్షలు రాసి అత్యుత్తమ ప్రతిభ చాటి తమకు చదువు చెప్పిన గురువులకు పేరు తీసుకు రావడం ఇప్పటి వరకు జరుగుతోంది. ఇందులో బోధనా ప్రమాణాలు పాటించి, అత్యుత్తమ బోధనతో చిన్నారుల్లో విద్యాసామర్థ్యాలను సాధించేలా తరగతి గదుల్లో టీచర్లు కష్టపడటం ఉండేది. ఇందుకు అనుగుణంగా విద్యార్థులు మంచి మార్కులు సాధించడమే కాకుండా ఉపాధ్యాయుల పని తీరును తెలుసుకొనే కొలమానంగా అందరూ భావించారు. కానీ 'కొత్తొక వింత.. పాతొక రోత' అన్న చందాన మారింది ఇప్పటి నూతన విద్యా హక్కు చట్టాలు, జాతీయ విద్యా మండలి కొత్త నియమనిబంధనలు సీనియర్ టీచర్లకు పెడతామంటున్న అర్హత పరీక్షలు వారికి పెద్ద పరీక్షగా మారాయి. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగాల్లో కొనసాగాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలతో వారికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది.

### ఓ వైపు నోటిఫికేషన్.. మరో వైపు గుబులు

కొన్ని నెలలుగా టీచర్ ఎలిజీబులిటీ టెస్ట్ (టెట్) ఉపాధ్యాయ వర్గాల్లో విస్తృతంగా చర్చనీయాంశంగా మారింది. 2009 సంవత్సరం తరువాత ఎంపికైన టీచర్లంతా టెట్ రాసి ఉత్తీర్ణులైన వారే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందారు. కానీ 2009 కన్నా ముందు డీఎస్సీల ద్వారా ఎంపికైన టీచర్లకు అప్పట్లో టెట్ పెట్టకపోవడంతో వారు రాయలేదు. తాజాగా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు టీచర్లంతా రెండేళ్లలో టెట్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలన్న ఉత్తర్వులు ఉండటంతో మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, ఎమ్మెల్సీలు ప్రజా ప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు. ఐదేళ్లలోపు లోపు రిటైర్ అయ్యే టీచర్లకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ క్రమంలో టెట్ నోటిఫికేషన్ రావడంతో ఈ నెల 15 నుంచి 29 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారానే పరీక్షలను వచ్చే ఏడాది 3వ తేది నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. ఫలితాలు ఫిబ్రవరి 10 నుంచి 16వ తేదీల్లో ప్రకటించనున్నారు. పేపర్-1 పరీక్షలకు ఎస్‌జీటీ, పేపర్-2 పరీక్షలను స్కూల్ అసిస్టెంట్ టీచర్లు రాయాల్సి ఉంటుంది. ఒక పేపర్ రాయాలి అంటే ఫీజు రూ.750, రెండు పేపర్లకు దరఖాస్తులు చేస్తే రూ. 1000 ఉంటుంది. రెండు పేపర్లకు సంబంధించి 150 మార్కులకు గాను జనరల్ అభ్యర్థులకు 90, బీసీలకు 75, ఎస్సీ, ఎస్టీలు, వికలాంగులకు 60మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు. ఉద్యోగులు, నిరుద్యోగులకు ఒకే విధానం ఉంటుంది.

### పుస్తకాల కొనుగోళ్లకు ప్రయత్నాలు

టెట్ పరీక్షల రెండు పేపర్లకు సంబంధించి సిలబస్, అర్హత మార్కుల విషయంలో సీనియర్ టీచర్లకు తిప్పలు తప్పడం లేదు. పేపర్-1లో సైకాలజీలో 30, తెలుగులో 30, ఇంగ్లీషులో 30, గణితంలో 30, ఈవీఎస్‌లో 30 ప్రశ్నలు, మొత్తం 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. పేపర్-2లో తెలుగులో 30, ఇంగ్లీషులో 30, సైకాలజీలో 30, సంబందిత సబ్జక్టుల్లో 60 మార్కులకు మొత్తం 150కు పరీక్ష ఉంటుంది. పేపర్-1కు 1 నుంచి 7వ తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. పేపర్-2లో పదవ తరగతి స్థాయి వరకు పరీక్షలు ఉంటాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పని చేసే టీచర్లకు సిలబస్‌ను చదివిందేకు పడరాని పాట్లు పడుతున్నారు. కొంతమంది ఆన్‌లైన్ కోచింగ్, మరి కొంత మంది పలు రకాల మాడ్యుళ్లు, పుస్తకాలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు దశబ్దాల సర్వీసు పూర్తి చేసిన టీచర్లకు మరల పరీక్షలు నిర్వహించడం, అర్హత సాధించాలని డెడ్‌లైన్ పెట్టడం వారికి విషమ పరీక్షలా మారింది.

## యాంటీబయాటిక్ మందులు వాడొద్దు

» మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనవసరంగా యాంటీబయాటిక్ మందులను వినియోగించవద్దని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, డాక్టర్ రాజేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్ అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ కార్యక్రమంపై మంగళవారం జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరం లేకున్నా యాంటీ బయోటిక్స్ వాడటం వలన రాబోయే కాలంలో వచ్చే జబ్బులకు మందులు పనిచేయక జబ్బులు దీర్ఘకాలం మెండిబారతాయని అన్నారు. అర్హత కలిగిన డాక్టర్లు సూచించిన విధంగా ఎన్ని రోజులు వాడాలో అన్ని రోజులు వాడితే యాంటీ బయోటిక్స్ పని చేస్తాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యాన్ని కాపాడుతాయని అన్నారు. గుర్తింపు పొందిన, అర్హత కలిగిన వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటి బయోటిక్ మందులను వినియోగించాలన్నారు. అనంతరం మెడికల్ కళాశాల నుంచి జడ్పీ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంసీహెచ్ ఎదుట మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్గించేలా ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సమతా రాణి, డాక్టర్ ప్రీతి తదితరులున్నారు.

# గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి కృషి

» ఐటీడీఏ పీవో రాహుల్
» ఉమ్మడి జిల్లాస్థాయి జోనల్ క్రీడలు ప్రారంభం



గెలిచిన విద్యార్థినికి మెడల్ అందజేస్తున్న పీవో, ఎమ్మెల్యేలు

పాల్వంచ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో వి. రాహుల్ అన్నారు. మంగళవారం మండలంలోని కిన్నెరసాని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి జోనల్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా అత్యున్నత స్థానాలను పొందుతున్నారని చెప్పారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు భవిష్యత్తులో దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలని చెప్పారు. ఇటీవల గిరిజన విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించడం గర్వకారణంగా ఉందన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపడం వల్ల మానసికంగా దృఢంగా ఉంటారని ఆయన అన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని కోరారు. గిరిజన విద్యార్థుల క్రీడల కోసం ఎమ్మెల్యేలకు వచ్చే నిధులలో కొంత శాతాన్ని కేటాయిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా క్రీడా అధికారి విజయలక్ష్మి, ఐటీడీఏ జోనల్ క్రీడల ఇన్‌చార్జి గోపాలరావు, గిరిజన సంక్షేమ అధికారి చంద్రమోహన్, సహాయక క్రీడా అధికారులు వెంకటనారాయణ, రాజేశ్వరరావు, రాంబాబు, శకర్, పీడీలు వెంకటేశ్వర్లు, నగేష్, బాలసుబ్రహ్మణ్యం, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### జోనల్ క్రీడల్లో గెలుపొందిన జట్లు ఇవే..

ఉమ్మడి జిల్లా ఐటీడీఏ జోనల్ బాలికల విభాగం క్రీడల్లో క్రీడా పోటీల్లో మొదటి రోజు గెలుపొందిన జట్లు ఇవే.. ఖమ్మం, వైరా, దుమ్ముగూడెం, మణుగూరు, పాల్వంచ, దమ్మపేట, ఇల్లెందు ఈ 7 జోనల్‌ల నుంచి ఐదువందల మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మొదటి రోజు బాలికలకు జరిగిన వాలీబాల్ పోటీలలో ఇల్లెందు జోన్ విద్యార్థినిలు మొదటి స్థానంలో నిలవగా దుమ్ముగూడెం, దమ్మపేట జోన్‌లకు చెందిన విద్యార్థినిలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కబడ్డీలో ఇల్లెందు జోన్( ప్రథమ), దమ్మపేట (ద్వితీయ), ఖోఖోలో దుమ్ముగూడెం(ప్రథమ), దమ్మపేట (ద్వితీయ), మణుగూరు జోన్ (తృతీయ) స్థానంలో నిలిచింది. క్యారంలో ఇల్లెందు (ప్రథమ), దమ్మపేట (ద్వితీయ) స్థానాలలో గెలుపొందారు. ఆర్చరీలో ఉమ్మడి జిల్లాలో బాలికల సీనియిర్ విభాగంలో ఇ. అవంతిక (ప్రథమ), ఎం. జీనీష (ద్వితీయ), లక్ష్మీ సౌజన్య తృతీయ స్థానంలో గెలుపొందారు. జూనియర్స్ విభాగంలో ఆర్చరీలో పి. వర్షిత (ప్రథమ), చైతన్య (ద్వితీయ), పి. లావణ్య తృతీయ స్థానాల్లో నిలిచారు.



ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

# 'సీతారామ'ను సత్వరం పూర్తిచేసి సాగునీరు ఇవ్వాలి

( 5వ పేజీ తరువాయి )

ఆ ఉద్దేశం లేదన్నారు. ఇంకా రాజకీయాల్లో నేర్చుకోవాల్సింది చాలా ఉందని, ప్రధానంగా ప్రజాసమస్యల పరిష్కారంపైనే దృష్టి పెట్టామన్నారు. రాష్ట్రంలో ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమానికి ఈజిల్లా ఊపిరిపోసిందని, 1969లో అన్నాబత్తుల రవీందర్ నాథ్ దీక్షను గుర్తుచేశారు. ఇక మలిదశ ఉద్యమంలో కేసీఆర్ అరెస్టు సమయంలో న్యూడెమోక్రసీ, పీడీఎస్‌యూ, పలు ప్రజాసంఘాలు కేసీఆర్‌ను కాపాడుకున్నాయన్నారు. ఇక జలగం వెంగళరావు, తుమ్మల నాగేశ్వరావు లాంటి నేతల కృషితో జిల్లా అభివృద్ధి సాధించినా ఇంకా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ ముగ్గురు మంత్రులున్నారని, వారు విభేదాలు వీడి అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. జమలాపురం ఆలయ అభివృద్ధికి నిధులివ్వాలని డిమాండ్ చేశారు. చింతకాని మండల సీపీఎం నేత సామినేని రామారావు హత్యపై సత్వరం విచారణ జరపాలని, నిందితులను వెంటనే అరెస్టుచేయాలని త్వరలోనే డీజీపీని కలబోతున్నామన్నారు. సింగరేణి కాంట్రాక్టు సమస్యలపై బుధవారం సింగరేణి భవన్‌ను ముట్టడించబోతున్నామని తెలిపారు. వనజీవి రామయ్య పేరుతో స్మారక పార్కును ఏర్పాటుచేయాలన్నారు. ఖమ్మంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాలేరు జేఎన్‌టీయూకు శాశ్వత భవనాలు నిర్మించాలని, మున్నేరు వరద రిటైనింగ్‌వాల్స్‌ను పూర్తిచేయాలని కోరారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నష్టపోకుండా హైడ్రాద్వారా వెంచర్లకు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. తెలంగాణ జాగృతి జనంబాటతో ఇప్పుడు అధికార విపక్షాల్లో కదలిక మొదలైందన్నారు. పత్తి కొనుగోలు విషయంలో బీజేపీ తప్పించుకు తిరుగుతోందని, బీజేపీ ఎంపీలు మోదీ, అమిత్‌షా కాళ్లు పట్టుకుని అయినా పత్తి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆపరేషన్‌కగార్ పేరు తో ఇక్కడి బిడ్డల రక్తం తాగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్నా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచిందని, అందుకు ప్రతిపక్షాలు బీఆర్‌ఎస్, బీజేపీల వైఫల్యమే కారణమన్నారు. తాను ఎవరి బెదిరింపులకు భయపడనని, జైలులో ఆరునెలలున్నా ధైర్యంగా ప్రజల్లోకి వచ్చానన్నారు.

### బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది మోసం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ల పై మాటమారుస్తున్నారని 42శాతం రిజర్వేసన్ అమలుచేయకపోతే బీసీ ద్రోహిగా మిగులుతారని కవిత పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగానే రిజర్వేషన్లను సాధించాక ఎన్నికలు నిర్వహించాలని, పార్టీపరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం బీసీలను మోసంచేయడమేనన్నారు.

ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పరంగా 42శాతం ఇచ్చేదేంటని, బీఆర్‌ఎస్ 51శాతం రిజర్వేషన్లు ఎప్పుడో ఇచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇస్తామనిచెప్పిన250గజాల ఇంటిస్థలం, పింఛన్ ఇచ్చి తీరాలని,ఇందుకోసం జాగృతి పోరాటం చేస్తుందన్నారు.

# ఖమ్మంలో రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్ ?

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 2025 డిసెంబరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఈ ఏడాది ఖమ్మంలో నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు సమాచారం. దీనిలో భాగంగా మంగళవారం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంచాలకులు జి. రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీలు నగరంలోని టేకులపల్లిలోని డైట్ కళాశాలను సందర్శించారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు కావాల్సి సదుపాయాలు, విద్యార్థులు తయ్యారు చేసిన ఎగ్జిబిట్స్ ప్రదర్శనకు కావాల్సిన సదుపాయాలపై డైట్ కళాశాల ప్రిన్సిపల్ నాంపల్లి రాజేష్‌తో కలిసి పరిశీలించారు. సైన్స్ ఫెయిర్‌లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలకు సంబంధించిన కార్యాచరణను చేపట్టాలని, అందుకు సంబంధించిన పనులు వెంటనే చేపట్టాని సూచించినట్లు స మాచారం. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఖమ్మం ఆతిథ్యం ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో విద్యా శాఖ అధికారులు సదుపాయాలపై దృష్టి సారించాలని, ఎవ్వరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యాశాఖ అధికారులకు సూచించినట్లు తెలిసింది. ప్రతి ఏటా నిర్వహించే జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో సౌకర్యాలు కల్పించడంలో విఫలమైన జిల్లా విద్యాశాఖ అధికారులు రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌ను ఎలా నిర్వహిస్తారో వేచిచూడాలి.



డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంచాలకుడు రమేష్

### పాఠశాలల తనిఖీ

జిల్లాలోని వివిధ పాఠశాలలను మంగళవారం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంచాలకులు జి. రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ నాంపల్లి రాజేష్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఎన్ఎస్పీ కెనాల్ ప్రైమరీ పాఠశాలలోని ఏఎక్స్‌ఎల్ తరగతి గదుల పరిశీలించి, జీహెచ్ఎస్ ఎన్ఎస్పీ కెనాల్ ఉన్నత పాఠశాలలోని తరగతి గది బోధన అభ్యసన ప్రక్రియ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్లానిం గ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి శైలజాలక్ష్మి, రాష్ట్ర సైన్స్ సూపర్‌వైజర్ ఉమారాణి, డీఎస్‌వో రామదాస్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దుర్గాభవాని తదితరులున్నారు.

# మొదటి వారంలో ముహూర్తం!

( మిగతా 5వ పేజీలో )

ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా విద్యాశాఖ సెక్రటరీ శ్రీధర్, జిల్లా అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమ వేదిక, స్టేజీ, లేఅవుట్ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రోడ్డు, వసతులు, పార్కింగ్, రాకపోకలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, భద్రత విషయాల్లో లోపాలు లేకుండా పోలీసు శాఖతో సమన్వయంతో పని చేయాలన్నారు. అతిథుల నిర్వహణ, వసతి, మీడియా సెంటర్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తుమ్మల సూచించారు. విశ్వవిద్యాలయ భవనాలు, ల్యాబ్‌లు, మౌలిక వసతుల పరిశీలనకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. యూనివర్సిటీ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మారనుందన్నారు. 300 ఎకరాల్లో నిర్మించిన ఈ వర్సిటీ.. ఇప్పటికే ఆధునిక ల్యాబ్‌లు, పరిశోధన కేంద్రాలు, అంతర్జాతీయ ప్రమాణాల విద్యా వసతులతో నిర్మించినట్లు పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ విద్యారంగానికి జాతీయస్థాయిలో కొత్త గుర్తింపు లభించనుందన్నారు.

## 240 గ్రాముల గంజాయి స్వాధీనం

ఖమ్మం క్రైం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో పలువురు యువకుల వద్ద నుంచి కొంత గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నగరంలోని 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద నగరానికి చెందిన సంజయ్ కుమార్, శ్రావణ్ కుమార్, యోగేష్ అనే యువకులు ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో విధుల్లో ఉన్న పోలీసులు వారిని తనిఖీ చేయగా, వారి వద్ద రెండు ప్యాకెట్ల 40 గ్రాములు గంజాయి లభించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఖిల్లాకు చెందిన జానీ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

అదే విధంగా నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తూ ఉండగా నగరానికి చెందిన తోట నవీన్, శీలం కళ్యాణ్, చందా వాసుదేవ్, నూకల పవన్ అను వారిని తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 200 గ్రాములు గంజాయి పట్టుబడింది. దీంతో వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మహిళా సంఘాల సభ్యులకు ఉచిత చీరలు

» నేడు రఘునాథపాలెంలో పంపిణీకి శ్రీకారం చుట్టనున్న మంత్రి తుమ్మల
» గ్రామాలకు 2,41,512, పట్టణాలకు 56,400 చీరలు

రఘునాథపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు శుభవార్త. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకాలతో టీ క్యాంటీన్లు నుంచి పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సుల వరకు కేటాయించి మహిళల ఆర్థిక సాధికారితకు తోడ్పడుతోంది. మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న ప్రతీ మహిళకు ఓ చేనేత చీరను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు నెల రోజుల క్రితమే మహిళా సంఘాలకు పంపిణీ చే యాల్సిన చీరలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ ద్వారా.. పట్టణాలు, మున్సిపాలిటీల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా చీరలను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఏదులాపురం, కల్లూరుకు మాత్రం సెర్ప్ ద్వారా పంపిణీ జరుగుతాయి. రాష్ట్ర జౌళిశాఖ మంత్రి తుమ్మల బుధవారం రఘునాథపాలెంలో ఉచిత చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సన్యాసయ్య రఘునాథపాలెంలో కార్యక్రమానికి సంబంధించి.. ఏర్పాట్లను పరిశీలించారు.



గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ద్వారా ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం జరగనుంది. జిల్లాలోని పెనుబల్లిలో 12,674, సత్తుపల్లి మండలంలో 11,314, వేంసూరులో 12,144 కల్లూరులో 11,000, బోనకల్‌లో 11,500, మధిరలో 9,722, ఎర్రుపాలెంలో 11,292, తల్లాడ 13,816, వైరాలో 9,295, కొణిజర్ల 12,868, ఏన్కూరు 9,741, చింతకాని 13,000, కామేపల్లి 9,994, ఖమ్మం రూరల్ 10,574, కూసుమంచి 13,339, ముదిగొండ 14,273, నేలకొండపల్లి 13,978, రఘునాథపాలెం 14,123, సింగరేణిలో 12,612, తిరుమలాయపాలెంలో 14,976.. ఇలా సెర్ప్ పరిధిలో మొత్తం 2,41,512 మంది మహిళలకు ఒక్కో చీర చొప్పున పంపిణీ జరగనుంది.

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ఎస్‌హెచ్‌జీ సభ్యులకు 42,920, మధిర మున్సిపాలిటీలో 5,727, సత్తుపల్లి మున్సిపాలిటీలో 5,294, వైరాలో 5,926.. ఇలా మొత్తం 56,400 మంది మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు ఉచిత చీరలను అందుకోనున్నారు.

# ఇదేం లాజిక్?

( 5వ పేజీ తరువాయి )

వినియోగిస్తారని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఐదు కేజీల చెక్కర పొంగలికి గాను 16 కిలోల 10 గ్రాముల ముడిసరుకు వినియోగించడం జరిగిందని పేర్కొంటున్నారు. ముడిసరుకులతో పాటు నీటిని వినియోగించి చెక్కెర పొంగలి తయారు చేస్తే 32కేజీలు అవుతుందని దేవస్థానం అధికారులు పేర్కొంటుండటం చర్చనీయాంశంగా మారింది. ఇదే అంశం సామాజిక మాధ్యమాల్లో సైతం విస్తృతంగా ప్రచారం సాగింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇటీవల పలువురు భక్తులు రెండు లేదా ఐదు కేజీల చొప్పున చెక్కర పొంగలికి నగదు చెల్లిస్తే వారికి అన్ని కేజీలు మాత్రమే ఇచ్చినట్లు భక్తులు పేర్కొంటున్నారు.

### ఇటీవల పలుమార్లు ఇదే రీతిలో ?

ఇటీవల రామాలయంలోని ఓ అధికారి సూచనల మేరకు ఇదే రీతిలో బయట జరిగే కార్యక్రమాలకు చెక్కర పొంగలిని పంపినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నెలలో ఒక భక్తుడి పేరిట రెండు అంకెల సంఖ్యలో నామమాత్రంగా నగదు చెల్లించి అధిక మొత్తంలో చెక్కెర పొంగలి తీసుకెళ్లినట్లు వినికిడి. ఇదిలా ఉండగా గత నెల జరిగిన అంతర్గత బదిలీల్లో 24గంటల్లోనే తమ విధుల్లో చేరాలని దేవస్థానం ఈవో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా నెల రోజులైనా ఈ విభాగంలో పని చేస్తున్న ఒకరు అక్కడే విధులు నిర్వహిస్తున్నట్లు వినికిడి. అయితే చెక్కర పొంగలి ఘటనలో దేవస్థానం అధికార, ఉద్యోగ వర్గాల్లో భిన్న స్వరాలు వినిపిస్తుండటం గమనించదగ్గ విషయం. ఇదే విషయంపై గతంలో ఇక్కడ పని చేసి ఉద్యోగ విరమణ పొందిన కొందరిని అడగ్గా వారు సైతం ఇది ఏ విధంగా సాధ్యమవుతుందో తమకు అర్థం కావడం లేదని పేర్కొనడం గమనార్హం. మనం ఎంతకైతే నగదు చెల్లిస్తామో అంత ప్రసాదాన్నే ఇవ్వడం సర్వసాధారణమని, కానీ దిట్టం ప్రకారం దేవస్థానం తయారు చేసిన ప్రసాదాన్ని మొత్తం నగదు చెల్లించిన వారికి ఇచ్చేయడం సబబు కాదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

### ● దిట్టం ప్రకారం అందజేశాం : కె.దామోదర్‌రావు, ఈవో

భద్రాద్రి దేవస్థానంలో దిట్టం నిబంధనల మేరకు ఐదు కిలోల చెక్కెర పొంగలికి నగదు రూ.2వేలు చెల్లించి.. ప్రసాదాన్ని తీసుకొని వెళ్తున్న క్రమంలో ఎస్‌పీఎఫ్ సిబ్బంది తనిఖీ చేశారు. దేవస్థానం మరోసారి తనిఖీ చేసి తూకం వేయగా అంతకు ముందు వచ్చిన 32కేజీల తూకం రావ డంతో మళ్లీ ఆ భక్తులకు అందజేశాం. ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదు. దేవస్థానంలో ఉన్న నిబంధనల ప్రకారమే ఇచ్చాం.

## కుటుంబ సభ్యులకు ఇద్దరి అప్పగింత

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్‌లో ఓ వ్యక్తికి ఆశ్రయం కల్పించి వైద్య సేవల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించిన అన్నం ఫౌండేషన్. నల్గొండ జిల్లా తిరుమలగిరి ప్రాంతానికి చెందిన ఒక (60) సంవత్సరాల మతి స్థిమితం లేని నాగండ్ల వెంకటరెడ్డి అనే వ్యక్తిని గత జూన్ నెల 3న ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు చేరదీసి వైద్య సేవల అనంతరం కోలుకోని వివరాలు వెల్లడించాడు. అతడి భార్య నాగండ్ల చెన్నమ్మ ఆచూకీ తెలుసుకొని మంగళవారం వారికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో అన్నం శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్ : రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు ప్రాంతంలో గత జూలై నెల 25న మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంటే స్థానికులు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ వ్యక్తిని పట్టుకుని అన్నం శ్రీనివాస్‌కు అప్పగించడం జరిగింది. ఆ వ్యక్తిని అన్నం శ్రీనివాస్‌రావు చేరదీసి సుమారు నాలుగునెలలపాటు వైద్యం చేయించారు. అనంతరం అతను కోలుకుని తన పేరు రాజేందర్ కుమార్‌నాయక్ అని తను జార్ఖండ్ వాసిని అని, ఊరి పేరు లోట్వా అని, గుమ్లా జిల్లా అని తెలిపారు. దీంతో అన్నం శ్రీనివాస్‌రావు సదరు వ్యక్తిని రూరల్ పోలీసులకు అప్పగించాడు. పోలీసులు అతని కుటుంబ సభ్యుల ఆచూకీ తెలుసుకుని సమాచారం అందించగా మంగళవారం పోలీసులు అతడిని స్వగ్రామానికి పంపించారు. అన్నం శ్రీనివాస్‌రావును పోలీసులు, స్థానిక ప్రజలు అభినందించారు.

# శోభాయమానంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో భాగంగా లక్ష్మీనరసింహస్వామి ప్రత్యేక పల్లకీ సేవ

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్) స్వామివారు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వయంభు దివ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి (గుట్ట) గిరి ప్రదక్షిణ మంగళవారం శోభాయమానంగా జరిగింది. ఆలయ అర్చక బృందం, దేవాదాయ శాఖ అధికారులు, భక్త బృందాల ఆధ్వర్యంలో వేలది మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేక పల్లకీలో గిరి ప్రదక్షణలో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసచార్యులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్‌రావు, దేవాదాయ శాఖ అధికారులు, భక్త బృందాల ఆధ్వర్యంలో స్వామివారి గిరి ప్రదక్షిణ సాగింది. ఈ గిరి ప్రదక్షిణ నిర్వహించిన ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు రాకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంతో గిరి ప్రదక్షిణ ప్రశాంతంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రతి నెల స్వామివారి జన్మ నక్షత్రం రోజన స్థంభాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో, అర్చక బృందం తెలిపింది. ప్రతి నెల స్వామివారి జన్మ నక్షత్రం రోజున అశేష భక్తజనుల నడుమ స్వామివారి గిరి ప్రదక్షిణ నిర్వహించటం జరుగుతుందని ఆలయ ఈవో తెలిపారు. ఈ గిరి ప్రదక్షిణ సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమై రాత్రి 8గంటల వరకు నిర్వహించారు. స్వామి కొండ చుట్టూ జయకేతనాలతో నరసింహస్వామి నామకీర్తనల నడుమ భక్తిభావంతో భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ సుమారు రెండు కిలోమీటర్ల వరకు ఉండటంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రాంభమై గుట్టచుట్టూ తిరుగుతూ గుట్టపైకి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఈ ప్రదక్షిణ అనంతరం కొండపై ఉన్న ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన స్వాతి నక్షత్ర జ్యోతిని వెలిగించి భక్తులు దివ్యజ్యోతి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

# ఈసీఆర్ అమల్లో ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం

**ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్ శ్రీజ**
**షోకాజ్ నోటీసు జారీ..**
**14 రోజుల వేతనం నిలిపివేత**
**ఏన్కూరు మండలం సూర్యతండా పాఠశాల ఆకస్మిక తనిఖీ**



ఏఈఈవోపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఏన్కూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ప్రత్యేకశ్రద్ధతో అమలుచేస్తున్న ఎవరీ చైల్డ్‌రీడ్ (ఈసీఆర్) కార్యక్రమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ చర్యలు చేపట్టారు. మంగళవారం ఏన్కూరు మండలంలోని సూర్యతండా ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు.ఈసీఆర్ ప్రోగ్రాం అమలు తీరును పరిశీలించే క్రమంలో.. ఓ బాలికను చదివించగా ఆమె సరిగా చదవలేదు. కానీ ఆ బాలిక మార్కుల జాబితాను చూడగా ఎక్కువగా ఉన్నాయి. ఎక్కువ మార్కులు వచ్చిన అమ్మాయి ఎందుకుచదవడంలేదంటూ అదనపు కలెక్టర్ ఉపాధ్యాయుడు రమేష్‌ను ప్రశ్నించారు. ప్రోగ్రాం ఆన్‌లైన్‌లో ఎందుకు అప్‌లోడ్ చేయలేదని అడగ్గా సెల్‌ఫోన్ పనిచేయడంలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన అదనపు కలెక్టర్ ఆ ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు 14 రోజుల వేతనాన్ని నిలిపేయాలని ఎంఈవో వాసవీదేవిని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సందర్శించి మరమ్మతు పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం సక్రమంగా చేపట్టడంలేదని ఏఈ సురేష్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిసరాలను శుభ్రంగాఉంచాలని తెలిపారు. కోతులకు ఆవాసంగా ఉన్న ప్రాంతంలో ఈ కేంద్రాన్ని ఎందుకు ఏర్పాటుచేశారని, మరమ్మతుల సమయంలోనైనా సమస్యను తనదృష్టికి ఎందుకు తేలేదని సిబ్బందిని ప్రశ్నించారు. చుట్టూ తిరిగిరాకుండా మెయిన్‌రోడ్డునుంచి భవిత కేంద్రానికి రహదారి ఏర్పాటు చేయాలని ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీను ఆదేశించారు. భవిత కేంద్రానికి చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లడారు. బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీవో జీవీఎస్‌నారాయణ, పీఆర్ ఏఈ సూర్యనారాయణ ఉన్నారు.

# బూటకపు ఎన్‌కౌంటర్‌తో హిడ్మాను హతమార్చారు

**ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి**
**హత్యలు చేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలి**
**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మడవి హిడ్మాతో పాటు మరో ఐదుగురిని బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరపాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరస్పరం ఎదురు దాడులకు పాల్పడి మృతి చెందితే ఎన్‌కౌంటర్ అంటారని, కేంద్ర ప్రభుత్వ బలగాలు మాత్రం ఏకపక్షంగా మావోయిస్టులను హత్యలు చేస్తున్నాయని విమర్శించారు. మార్చి 2026 నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామంటూ కేంద్రంలోని పెద్దలు ప్రకటనలు చేస్తూ వందలాది మంది మావోయిస్టులను హత్యలు చేస్తున్నారని ఆవేదన చెందతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జంగిల్ రాజ్యాన్ని నిర్మూలిస్తామంటూ ప్రకటనలిస్తూ చట్టాలను నీరుగారుస్తూ ఉన్న అధికారంతో నిరాశ్రయులైన వారిని హత్యలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. నేరం చేస్తే శిక్షించడానికి చట్టాలు ఉన్నాయని, చట్టాలను అమలు చేసే అవకాశం ఉన్నా చట్టాలను నీరుగారుస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులపైన, కమ్యునిస్టులపైన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అసహనం వ్యక్తం చేస్తూ దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. మావోయిస్టులపై జరిగిన దాడులపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. గోద్రాలాంటి సంఘటనలను మాఫీ చేస్తూ కొత్త సమస్యలను సృష్టిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి దేశంలో శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఎన్నికల్లో ఓట్ల చోరీ చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల వారీగా సోషల్ ఆడిట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని, శాంతిని నెలకొల్పేందుకు మేధావులతో చర్చలు జరపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, సీపీఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, వంగా వెంకట్, మల్లిఖార్జున్, నరేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జావెలెన్ త్రోలో జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

అశ్వాపురం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో ఈనెల 17 వరకూ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థిని ఎస్‌కె.అమ్రిన్ జావెలిన్‌త్రో పోటీల్లో స్వర్ణపతకం, షాట్‌పుట్‌లో రజత పతకంసాధించి ప్రతిభ కనబర్చింది. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషబాబు, అధ్యాపకులు అమ్రిన్‌ను శాలువాతో సన్మానించి సత్కరించారు. కోచ్ గిరిప్రసాద్ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన అమ్రిన్ కళాశాలకు గౌరవం తీసుకువచ్చిందని, భవిష్యత్‌లో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# పత్తి రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

**ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు**
**నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసన**



మార్కెట్ యార్డులో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఖమ్మం మార్కెట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం ఖచ్చితంగా కనపడుతుం దని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బాణోత్ చంద్రావతి, కందాళ ఉపేందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన వారు మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాలకు పంట దిగుబడి తగ్గి రైతులు ఆవేదన చెందుతున్నారని, తీరా చేతికొచ్చిన అరకొర పంట అమ్ముకుందామంటే మార్కెట్‌లో మద్దతు ధర దక్కట్లేదని వాపోయారు. పత్తి క్వింటాలుకు రూ.8వేల మద్దతు ధరకు మార్కెట్‌ల ద్వారానే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సీసీఐ కేంద్రాలను మార్కెట్‌లోనే ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు మాయమాటలు వద్దు, మద్దతు ధర ముద్దు అంటూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ గుండాల క్రిష్ణ, నాయకులు పగడాల నాగరాజు, బెల్లం వేణు, ఖమర్ పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : ఆవునూరి మధు

ఖమ్మం అర్బన్ నవంబరు18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాను బోగస్ ఎన్‌కౌంటర్ జరిపారని ఈ ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో జరిగిన సంతాప కార్యక్రమంలో హిడ్మాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మారేడుమిల్లి వద్ద హిడ్మా ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు కట్టుకథ అల్లుతున్నారని ఆరోపించారు. అంతకుముందే పోలీసులు హిడ్మాను, అతని భార్యను మరికొందరిని అరెస్టు చేశారన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధం, చట్టవ్యతిరేకంగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందన్నారు. వందలాది మంది ఆదివాసీలను హననం చేసే దారుణాలకు అమిత్‌షా, మోడీ ఎందుకు పాల్పడుతున్నారని ప్రశ్నించారు. అడవుల్లోని సహజ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చే సేందుకు విప్లవోద్యమాన్ని అణిచివేసే కుట్రకు పాల్పడుతున్నారని తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లతో, హత్యలతో ఉద్యమాన్ని అణచివేయటం ఎవరికీ సాధ్యంకాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, నాయకులు పాముల మోహన్‌రావు, వీవీ రావు, సుబహాన్, రమేష్, ఉమాశంకర్ షబ్బీర్, మాధవరావు, బేతంపూడి నాగరాజు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

బోనకల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల క్రాస్‌రోడ్డు సమీపంలో గల ప్రధాన రహదారిపై గల మూల మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రావినూతలకు చెందిన కొమ్మినేని కమలాకర్ కారులో బొర్రా సరోజిని, కొమ్మినేని భారతీలక్ష్మీలు కలిసి ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి వైద్య పరీక్షలకు వెళ్లారు. అక్కడ వైద్య సేవలు పూర్తైన తరువాత తిరిగి రావినూతలకు వస్తున్న క్రమంలో మూల మలుపు వద్ద ప్రమాదవశాత్తు కారు స్టీరింగ్ హార్డ్ అవ్వడంతో కిందకు దిగింది. ఈసంఘటనలో సరోజినికి తీవ్రగాయాలు కాగా,మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరికి 108 సిబ్బంది సంద్రు మనోహర్, మిథున్ చక్రవర్తిలు ప్రథమ చికిత్స చేసి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం క్రైం, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం గుట్టపై ఓ చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. టూటౌన్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మంలోని లెనిన్‌నగర్‌కు చెందిన బానోత్ శ్రీధర్(57) స్థానికంగా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంతకాలంగా కిడ్నీ నొప్పితో బాధపడుతున్న అతను మంగళవారం ఆలయ గుట్టపైకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన ఆలయ సిబ్బంది టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ప్రణయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఖైదీల్లో సత్ప్రవర్తనకు విప్లవాత్మక చర్యలు

**'థమ్సిఇన్.. సైన్ ఔట్' లక్ష్యంతో అక్షరాస్యత పథకం**
**జైళ్లు-సంస్కరణల విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా**
**ఖమ్మం జిల్లా జైలులో తేనెటీగల పెంపకం ప్రారంభం**
**ఇల్లెందులో సబ్‌జైలు తనిఖీ**



ఖమ్మం జైల్లో తేనెటీగల పెంపకం బాక్స్‌లను పరిశీలిస్తున్న సౌమ్య మిశ్రా



జైళ్లశాఖ అధికారులతో మాట్లాడుతున్న జైళ్ల విభాగం డీజీ సౌమ్య మిశ్ర

ఖమ్మంక్రైం/ఇల్లెందు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఖైదీల్లో సత్ప్రవర్తన వచ్చేలా నేర ప్రవృత్తికి తావులేని రీతిలో రాష్ట్రంలోని జైళ్లల్లో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని జైళ్లు- సంస్కరణల విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా వెల్లడించారు. రెండు రోజులు ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన సౌమ్యమిశ్రా మంగళవారం తొలుత ఖమ్మంజిల్లా జైలులో తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేనెటీగల పెంపకం వల్ల వచ్చే స్వచ్ఛమైన తేనెను ప్రజలు కొనుగోలు చేసేలా అందుబాటులో ఉంచే విధంగా ఏర్పాటు చేశామన్నారు. జైలు ప్రాంగణంలో స్టాల్స్ ఏర్పాటు చేసి వాటి నుంచి వచ్చే లాభాల్లో ఖైదీలకు కొంత చెల్లిస్తామన్నారు. దీనిద్వారా ముద్దాయిలు తేనెటీగల పెంపకం గురించి తెలుసుకొని విడుదలైన తరువాత ప్రభుత్వ సహాయంతో సొంతంగా ఉపాధి పొందగలుగుతారన్నారు. అనంతరం ఇల్లెందు సబ్‌జైలును తనిఖీ చేశారు. ఈసందర్భంగా సౌమ్య మిశ్రా విలేకరులతో మాట్లాడారు. 'థమ్సిఇన్..సైన్ ఔట్' లక్ష్యంగా ఖైదీలందరినీ అక్షరాస్యతవైపు మళ్లిస్తున్నామని, జైళ్లల్లో వారికి ప్రత్యేక ఉపాధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తద్వారా వచ్చే ఉపాధి డబ్బులు ఆ కుటుంబాలకు సైతం అందజేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రప్రథమంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని జైలులో ఖైదీల స్వయం ఉపాధి పథకంగా తేనటీగల పెంపకాన్ని ప్రారంభించామని, తద్వారా ఉపాధి అవకాశాలు భారీగా కలుగుతాయన్నారు. జైళ్లలో నిరక్షరాస్యులైన ఖైదీలను అక్షరాస్యులుగా మార్చి సంతకం చేసేస్థాయికి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని, అంతేకాక ఓపెన్‌స్కూల్స్, అంబేద్కర్ విశ్వవిద్యాలయం ద్వారా ఉన్నత విద్యా అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఖాళీగా ఉండటం మూలంగా నేరప్రవృత్తి పెంచుకున్న వారిని గుర్తించి వారు ఇతర మార్గాల వైపు మళ్లకుండా స్వయం ఉపాధి పథకాలు అమలుచేస్తున్నామని వారు సంపాదన డబ్బును వారి కుటుంబాలకు పంపిస్తున్నామని తెలిపారు. అంతేకాక ఖైదీల పిల్లల వివాహాలు, ఇతర స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నామని వెల్లడించారు. శిక్షపడిన ఖైదీలకే కాక అండర్ ట్రయల్ ఖైదీలు సిద్ధపడితే వారికి కూడా ఈ పథకాలు వర్తింపజేస్తున్నామన్నారు. అంతేగాక మాదకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని.. మాన్పించడానికి రాష్ట్రంలోని నాలుగు జైళ్లల్లో డ్రగ్స్ ఎడిక్షన్ సెంటర్‌లు, ఒక జైలులో మహిళా ఖైదీలకు స్వచ్ఛంద సంస్థల ద్వారా సైకియాట్రీ కౌన్సిలింగ్‌లు ఇప్పిస్తున్నామని తెలిపారు. 2024లో సత్ప్రవర్తనల కారణంగా 2,013 మంది ఖైదీలను విడుదల చేశామని వారిలో 35మంది మహిళలున్నారని వెల్లడించారు. అదేరోజు 70 మందికి స్వయం ఉపాధి కల్పించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జైళ్ల విభాగం ఆధ్వర్యంలో 31 పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తున్నామని వాటిల్లో 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఉపాధి అవకాశాలతో వారు నేరస్వభావానికి దూరవుతారన్న భావనతోనే ఖైదీల మానసిక స్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. జైళ్లల్లో ఉండే మహిళా ఖైదీలకు ఆరేళ్లలోపు సంతానం ఉంటే ఆ సంతానం తల్లితో పాటు స్వేచ్ఛగా ఉంటూవారికి జైల్లోనే మదర్ ఫీడింగ్, విద్యా అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అంతకుముందు ఆమె ఇల్లెందు సబ్‌జైలును తనిఖీ చేశారు. జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. డీజీ సౌమ్యమిశ్రా వెంట వరంగల్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ మురళి, ఖమ్మం జైల్ సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్. జైలర్ ఎన్.చంద్రశేఖర్ తదితరులున్నారు.

## మూడో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరిలో 'ఎఫ్ఎల్ఎస్'

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మూడో తరగతి విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు పాఠశాల విద్యా విభాగం ఫిబ్రవరి నుంచి ఫౌండేషన్ లెర్నింగ్ స్టడీ సర్వే (ఎఫ్ఎల్ఎస్) చేపట్టాలని నిర్ణయించారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయనేది ఈ సర్వేలో పరిశీలిస్తారు. వారికి వివిధ రకాల సామర్థ్యాలకు సం బంధించిన పరీక్షలను నిర్వహిస్తారు. బొమ్మలు గుర్తించడం, వాటి గురించి వివరించడం, బొమ్మలు వేయడం, రాయడం, చదవడం వంటి పరీక్షలు ఉంటాయి. ఈ సర్వేని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను అవసరమైన మేర సన్నద్ధం చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులను, పాఠశాల హెచ్ఎంలను ఆదేశించింది. ఫిబ్రవరిలో నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించిన విషయాలపై విద్యార్థులను సంసిద్ధం చేయాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మీ ఆదేశించారు.

# కవులు సమాజ సంపదతో సమానం

**కవిగా రాణించాలంటే అన్ని రంగాల్లో పట్టు ఉండాలి**
**గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

చుంచుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కవులు సమాజ సంపదతో సమానమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. మంగళవారం 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ముఖ్యఅతిథిగా పాల్గొని కవి సమ్మేళనంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచంలోని అన్నిరంగాలపై విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే కవులుగా రాణించగలరని సూచించారు. ఓ కవి కలం నుంచి జాలువారే ప్రతీ సిరాచుక్క వేయి మెదళ్లను కదలించగలిగే శక్తిగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు కూడా కవులుగా ఉండటం ఎంతో అదృష్టమని, మీరు రాసే కవితలు, రచనలు రాబోయే రోజుల్లో చక్కటి ప్రాచుర్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. తనకు పుస్తక పఠనం అంటే ఎంతో ఇష్టమని, అనేక మంది కవులు, రచయితలు రాసిన పుస్తకాలను చదివినట్లు గుర్తు చేశారు. విద్యార్థులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని, పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు పుస్తకాలతో ఉంటే మేలు జరుగుతుందన్నారు. ఇంత ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయం అని ఈ సందర్భంగా ఛైర్మన్ పసుపులేటి వీరబాబును అభినందించారు. గ్రంథాలయానికి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేసి గ్రంథాలయాభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కవులను సన్మానించారు. ముందుగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కరుణకుమారి, పంచాయతీరాజ్ భద్రాద్రి జిల్లా మినీ స్టోరియల్ అసోసియేట్ అధ్యక్షురాలు కె.అంబిక, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, గ్రంథపాలకురాలు మణిమృధుల, మధుబాబు, వాణి, సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## 'వనజీవి' కుటుంబానికి న్యాయం చేయాలి

**ప్రపంచానికి పర్యావరణం గురించి వివరించిన వ్యక్తి రామయ్య**
**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

ఖమ్మం రూరల్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి పర్యావరణం గురించి వివరించిన వ్యక్తి వనజీవి రామయ్య అని తెలంగాణా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. పర్యావరణంపై అలుపెరుగని ప్రచారం చేసిన వనజీవి కుటుంబానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుని న్యాయం చేయాలని కవిత కోరారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని రెడ్డిపల్లిలోని పద్మశ్రీ అవార్డు గ్రహిత వనజీవి రామయ్య కుటుంబ సభ్యులను మంగళవారం కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆయన చేస్తున్న కృషిని గుర్తించి పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించిందన్నారు. అలాగే రామయ్య మొక్కలు నాటడంలో ఆయన భార్య జానమ్మ పాత్ర కూడా ఎంతో ఉందన్నారు. గతంలో ఆయన చేసిన కృషికి అటవీశాఖ నుంచి పెన్షన్ వచ్చేదన్నారు. కానీ ఆయన మరణించిన తరువాత రామయ్య భార్యకు అటవీశాఖ వారు పెన్షన్ ఇవ్వడంలేదన్నారు. పర్యావరణంపై అలుపెరుగని ప్రచారం చేసిన వనజీవి పద్మశ్రీ రామయ్య కుటుంబానికి ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వనజీవి కుటుంబ సభ్యులు కవితకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



రామయ్య సతీమణి జానమ్మను పరామర్శిస్తున్న కవిత

# లక్ష్యంతోనే విజయం సాధ్యం..

**అవకాశాలను క్రీడాకారులు అందిపుచ్చుకోవాలి**
**పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు అభినందనీయులు**
**రాష్ట్రస్థాయి రైఫిల్‌షూట్ మీట్‌లో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ**



రాష్ట్ర ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూట్ గేమ్స్ మీట్‌ను ప్రారంభించిన భద్రాద్రి ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

లక్ష్మీదేవిపల్లి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రత, కృషిపట్టుదలతో రైఫిల్ షూట్ క్రీడలో రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధించవచ్చని, ఆసక్తి కలిగిన క్రీడాకారులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని క్రీడల్లో రాణించాలని భద్రాద్రి కొత్తగూడెంజిల్లా ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ ఉద్ఘాటించారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెంజిల్లా, లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ అండర్-14, -17, -19 ఏళ్ల బాల, బాలికల తెలంగాణ రాష్ట్ర ఇండోర్ రైఫిల్‌షూట్ గేమ్స్ మీట్‌ను ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రైఫిల్‌షూట్ క్రీడలను ప్రోత్సహించడం పట్ల క్రీడల్లో పాల్గొనే చిన్నారుల తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ క్రీడలు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ కృషితో నిర్వహిస్తున్నామన్నారు. ట్రైనీ కలెక్టర్ రైఫిల్ పట్టుకొని క్రీడలకు హాజరైన విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ పోటీలను సద్వినియోగ పర్చుకొని తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరగనున్న ఇండోర్ రైఫిల్ రేంజ్ పోటీల్లో పీప్ సైట్, ఓపెన్‌సైట్, పిస్టల్ షూట్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నరేష్ తెలిపారు. తొలిరోజు ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి 35 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా రాష్ట్ర వ్యాప్తంగా 170మందికి పైగా హాజరైనట్లు పేర్కొన్నారు. ఐటీసీ కంపెనీ సహకారంతో క్రీడాకారులకు, వారి తల్లిదండ్రులకు, కోచ్‌లకు భోజన సదుపాయం కలుగచేసినట్లు వివరించారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్నిఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపలో డీవైఎస్ వై.పరంధామరెడ్డి, కోచ్ నబి, హైదరాబాద్ నుంచి అబ్జర్వర్లు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, కోచ్‌లు తదితరులు హాజరయ్యారు.

## ఉద్యాన పంటలు లాభదాయకం

ఖమ్మంఅర్బన్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి లాభాలు గడించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్ అన్నారు. ఉద్యాన పంటల అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉద్యానాధికారులు రఘునాథ పాలెం మండలంలోని జింకలతండాలో పర్యటించారు. బొప్పాయి, టమోటా, ఆయిల్ పాం, పంటలను సందర్శించారు. పలు చీడపీడల నివారణకు సలహాలు సూచనలు ఇచ్చారు. పత్తి, మిర్చి వరి లాంటి సంప్రదాయ పంటల కాక ఉద్యాన పంటల సాగుచేసి లాభాలు పొందాలని సూచించారు. ఆయిల్‌పాం పంటకు ఎకరాకు రూ.50 వేల రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానాధికారినగేష్, హెఈవో జరీనా, గోద్రెజ్ ఫీల్డ్‌ఆఫీసర్‌చందు పాల్గొన్నారు.

# మరుగున పడిన మురుగు శుద్ధి

- మున్నేరు వరదలకు కొట్టుకుపోయిన మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం
- తిరిగి నిర్మాణం కాకపోవటంతో వోడీఎఫ్ అవార్డులకు గండి

నేడు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం



నగరంలో మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం

ఖమ్మంకార్పొరేషన్,నవంబరు18(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతనుంచి స్వచ్ఛతలో అనేకఅవార్డులను గెలుపొందిన ఖమ్మం నగర పాలక సంస్థ ఇప్పుడు మానవ వ్యర్థాల నిర్వాహణలో మాత్రం వెనుకబడింది. గతేడాది సెప్టెంబరులో మున్నేరుకు వచ్చిన వరద విపత్తులో జరిగిన నష్టాన్ని తిరిగి అధికారులు పూర్తి చేయలేక పోవటంతో ఓడీఎఫ్‌తో పాటుగా అనేక అవార్డులను కోల్పోయింది. కానీ మానవ వ్యర్థాల నియంత్రణ మిషన్ మాత్రం మరమ్మతులకు నోచుకోలేదు.

**హైదరాబాద్ తర్వాత ఖమ్మంలోనే..**

పట్టణ ప్రాంతాల్లో ప్రజల నివాసాల్లోని మరుగుదొడ్డి మానవ వ్యర్థాలను సెప్టిక్ ట్యాంకర్లు ద్వారా సేకరిస్తారు. అలా సేకరించిన మానవ వ్యర్థాలను స్వచ్ఛతా భారత్ మిషన్ నిబంధనల మేరకు వ్యర్థాలను శుద్ధి చేయాల్సి ఉంటుంది. ఖమ్మంలోని సెప్టిక్ ట్యాంకర్లు ద్వారా సేకరించిన మానవ వ్యర్థాలను శుద్ధి చేసేందుకు మున్నేరు పరివాహక ప్రాంతంలో డంపింగ్‌యార్డుకు సమీపంలో రూ.5.5కోట్లతో మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ తర్వాత ఖమ్మంలోనే అతిపెద్ద కేంద్రాన్ని నిర్మాణం చేశారు. రోజుకు 95 కిలో లీటర్లు డెనిసిటి వ్యర్థాలను శుద్ధి చేసింది. ఎన్నో ఏళ్లుగా మంచిగా నిర్వాహణ కొనసాగింది. 2021-24 వరకు ఖమ్మం నగర పాలక సంస్థకు స్వచ్ఛ భారత్, ఓడీఎఫ్ ప్లస్, ప్లస్(డబుల్‌ప్లస్) అవార్డులు రావటంలోను కీలకంగా మారింది. ఖమ్మం నగరంలో 100కు పైగా సెప్టిక్ ట్యాంకర్లు నిర్వాహకులకు ఉపయోగకరంగా మారింది. కాగా దీని నిర్వహణకు పదిమంది సిబ్బందిని నియమించారు. వారికి ఏడునెలలుగా జీతాలు రావటం లేదు.

**గతేడాది మున్నేరు వరదలకు గండి**

గతేడాది సెప్టెంబరు 1న వచ్చిన మున్నేరు వరద ప్రభావానికి మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం మిషన్లు కొట్టుకుపోయాయి. మరమ్మతులు చేయించేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య నూతన మిషన్ కొనుగోలుకు అనేక ప్రయత్నాలు చేశారు. కానీ ఇది కార్యచరణ కాలేదు. దీంతో ఈసంవత్సరం ఖమ్మం నగరంలో చేపట్టిన స్వచ్ఛభారత్,ఓడీఎఫ్ పరిశీలనలో వీధుల శుభ్రత నుంచి ఇంటింటి చెత్తసేకరణ వరకు మంచిగా మార్కులు వచ్చినా కూడా మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం లేక పోవటంతో ఖమ్మం నగరానికి రావాల్సిన స్వచ్ఛతా అవార్డులు రాలేక పోయాయి. మరి దిగువకు ఖమ్మం నగర పాలక సంస్థ ర్యాంకు దిగజారిపోయింది.

**నేడు అవగాహన కార్యక్రమాలు**

ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా బుధవారం ఖమ్మంనగరంలో అవగాహన కార్యక్రమాలు కార్యచరణ చేశారు. విలీన ప్రాంతాల నుంచి నగరంలో నూరుశాతం మరుగుదొడ్లు వినియోగించేలా ర్యాలీలు నిర్వహించనున్నారు.ఈమేరకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు.

## డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాలి

ఖమ్మంఅర్బన్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దానవాయిగూడెం డంపింగ్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారంచేపట్టాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డు సమస్య నివారించాలని డిమండ్ చేస్తూ సీపీఎం ఖమ్మం డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం డంపింగ్ యార్డును సందర్శించారు. ఎం ఏజబ్బార్, ఎస్‌కె మీరాసాహిబ్, ఎస్‌కె నాగులు మీరా, భూక్యాశ్రీనివాసురావు, బోడపట్ల సుదర్శన్, జె.వెంకన్నఆబు, గాలి వెంకటాద్రి,ఎస్‌కెఇమామ్,రవీంద్ర డంపింగ్‌యార్డును సందర్శించారు.

## వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రగ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకువ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. నగరానికి చెందిన 10పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కరుణకుమారి గ్రంథాలయ ఉద్యోగుల సంఘంనాయకులు, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంఅర్బన్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈపీఎస్ 95 పెన్షన్‌దారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం పాటిస్తూ మంగళవారం ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పీఎఫ్‌కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు ఎల్.గోపీ చంద్, కళ్యాణం నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఏడు నూతులరవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు18(ఆంధ్రజ్యోతి):ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలోప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకర్, జిల్లా బీసీ సంక్షేమఅధికారి జ్యోతి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, డీఎంహెచ్‌వో రామారావు, సీనియర్ ఫ్యాకల్టీ రాజేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ నరేందర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 34దరఖాస్తులు అందాయి. అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత రెండుమూడు రోజుల్లో తుదిజాబితాను వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు. ఈసారి కూడా రేడియాలజీ పోస్టుల కోసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఆయన తెలిపారు.

## గుండెపోటుతో విలేకరి సాంబశివరావు మృతి

కామేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్ట్ ముక్తి సాంబశివరావు(40) మంగళవారం గుండెపోటు మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశాడు. ఇల్లెందు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఆదివాసీవిద్యార్థి సంఘంలో పని చేశాడు. మృతి పట్ల ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సంతాపం తెలియజేశారు. ఆయన పాడెను వ్యవసాయ కమీషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి,యువజన కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి మోశారు.

## చెర్వుమాధారంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలాజీ

నేలకొండపల్లి,నవంబరు18(ఆంధ్రజ్యోతి):రాజారాంపేట సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం చెర్వుమాధారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు ధీరావత్ బాలాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఈవూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి పమ్మి రామకోటయ్య, ఏఎంసీ డైరెక్టర్ నూరేపల్లి రవి, రైతులు యడవల్లి శ్రీను, అమరగాని ఎల్లయ్య, యరదేశి నర్సింహారావు, ఏఈఓ శ్రీకాంత్, సొసైటీ డైరెక్టర్లు కాటం వెంకటరెడ్డి, పఠాన్ దిలావర్‌ఖాన్, సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.

## ఫెన్సింగ్ రాళ్లు ధ్వంసం

తిరుమలాయపాలెం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపెడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు నిమ్మల నరసింహారెడ్డికి చెందిన ఫెన్సింగ్ రాళ్లను అదే గ్రామానికి చెందిన బొల్లికొండ రామనర్సు, బొల్లికొండ వెంకటేశ్వర్లు ధ్వంసం చేశారు. బచ్చోడు, జూపేడ గ్రామాల మధ్య రోడ్డుపక్కన ఉన్న భూమిని నర్సరీ కోసం లీజుకు ఇచ్చారు. ఈ మేరకు నర్సింహారెడ్డి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## నెట్‌బాల్ పోటీలకు హార్వెస్ట్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న రవిమారుత్, పార్వతిరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్‌నవంబరు18(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 25 నుంచి 29 వరకు మంగళూరులో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-19 జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు తమ కళాశాల విద్యార్థులు రిష్వమోహిత్‌క్రిష్ణ ఎంపికైనారని కళాశాల యజమాన్యం తెలిపింది. ఇటీవల రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, అభినందించారు. పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలన్నారు.

## గ్రాంట్ ఇన్ ఎయిడ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి**

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ యువ కౌమార అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోసం జిల్లాలోని ఎన్‌జీవోలు, ఎన్‌పీవోస్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునీల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కావున లాభాపేక్ష లేని ఎన్‌జీవోస్, ఎన్‌పీవోస్ తమ ప్రతిపాదనలను ఆన్‌లైన్ పోర్టల్‌లో యూత్.యాస్.గవుట్.ఇన్ ద్వారా ఈనెల30 వరకు అప్‌లోడ్ చేయాలని కోరారు. ఇతరసమాచారం కోసం జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో నేరుగా, 9948207271 ఫోన్ నెంబరుని సంప్రదించాలని కోరారు.

# సాధారణ ప్రసవాలు పెరగాలి

**జిల్లా వైద్య అధికారులతో కలెక్టర్ అనుదీప్ సమీక్ష**



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు18(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకాన్ని కలిగించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో సాధారణ ప్రసవాల పెంపు,ఆసుపత్రుల పనితీరుపై అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రుల పనితీరు మెరుగుతోనే ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు.తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆశాకార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గర్భిణులను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న వసతులను వినియోగించుకుంటూ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. ప్రతీఆసుపత్రి పరిధిలో పీహెచ్‌సీ వైద్యాధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. ప్రతీఏరియాలో ఆనెల ఎన్నిప్రసవాలు జరిగే అవకాశం ఉంటుందో వివరాలు మన దగ్గర అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు ఆసుపత్రి వైద్యం కోసం రావాలంటే సర్కారుఆస్పత్రిపైఉన్న నమ్మకంతోనే మన పని తీరు తెలుస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎక్కువ ప్రసవాలు జరగాలని, ఆ దిశగా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రామారావు, డీసీహెచ్ఎస్‌రాజశేఖర్, వైద్యాధికారులు డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ కృపాఉషశ్రీ పాల్గొన్నారు.

## పొగమంచులో వాహన ప్రయాణం ప్రమాదకరం : సీపీ

ఖమ్మంక్రైం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): దట్టమైన పొగమంచు సమయంలో వాహన ప్రయాణం ప్రమాదకరమని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు నివారించాలని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొగమంచు కారణంగా రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనదారులు పాదచారులను గమనించే సామర్థ్యం గణనీయంగా తగ్గి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వాహనాలు వేగంగా నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడడం, అనుకోకుండా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలు వంటి ప్రమాదకర చర్యలు పూర్తిగా నివారించాలని తెలిపారు.

**జైళ్లశాఖ డీజిని కలిసిన సీపీ**



ఖమ్మంజిల్లాలో జైలులో ఓ కార్యక్రమానికి హాజరైన రాష్ట్రజైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రాను పోలీసు కమిషనర్ సునీల్ దత్ సోమవారం జైలువద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డీజీకి సీపీ పుష్పగుచ్ఛం అందించారు.

## 23న కబడ్డీ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జూనియర్ బాలుర, బాలికల జిల్లా కబడ్డీ జట్లను ఈనెల 23న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి వచ్చే నెల 2 నుంచి 7 వరకు నాగార్జునసాగర్, మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని ఆయన తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన వైరా ఎమ్మెల్యే



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి):జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పలుఅభివృద్ధి పనులు ప్రతిపాదనలు అందచేశారు. అనంతరం పలు సమస్యలపై ఆయన కలెక్టర్‌తో చర్చించారు.

## ఘనంగా కార్తీక వనసమారాధనలు



పెన్షనర్ల ఆధ్వర్యంలో వనసమారాధన

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు18(ఆంధ్రజ్యోతి):కార్తీకమాసం సందర్భంగా జిల్లా నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలని చెరుకూరి వారి మామిడితోటలో వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డు డీజీపీ పూర్ణచందర్‌రావు , బీసీ జేఏసీ నాయకులు దేవరకొండ సైదులు హాజరయ్యారు. రాష్ట్రప్రభుత్వరిటైర్డు ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంరూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలోని మామిడితోటలో వనసమారధన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సమం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుబ్బయ్య, తాల్లూరి వేణు పాల్గొన్నారు.



వనసమారాధనకు హాజరైన నాయీబ్రాహ్మణులు

## ఘనంగా కార్తీక మాస శివరాత్రి పూజలు



విభూధితో అభిషేకం చేస్తున్న అర్చకులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మాసశివరాత్రి సందర్భంగా మంగళవారం జిల్లాలోని పలు శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించారు.ప్రత్యేకపూజలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు.నగరంలోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, విభూధాభిషేకం నిర్వహించారు. సాయంత్రం రుద్రాహోమం, రాత్రి స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించినట్లు ఆలయ ఈవో రామకోటేశ్వర రావు తెలిపారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసుదన్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.కైకొండాయిగుడెం రోడ్డులోని శ్రీవిశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం, అనంతరం పల్లికి సేవ నిర్వహించారు.

**వైభవంగా లక్ష బిల్వార్చన పూజ**

నేలకొండపల్లి:నేలకొండపల్లిలోనిఅతిపురాతనమైన పార్వతీ సమేత శ్రీఉత్తరేశ్వరస్వామి ఆలయంలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం కార్తీక మాసం మాస శివరాత్రి రోజున నిర్వహించే లక్ష బిల్వార్చన మహాపూజను మంగళవారం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రికి సహపంక్తి భోజనం చేయటంతో లక్ష బిల్వార్చన పూజ ముగుస్తుంది. బిల్వార్చనకు రాష్ట్రంలో ఎక్కడెక్కడో స్థిర పడిన నేలకొండపల్లికి చెందిన బ్రాహ్మణులు అందరూ దాదాపుగా హాజరుగావటం సైతం ఆనాయితీగా వస్తున్నది. ఆనవాయితీగా వస్తున్న ఆచారాన్ని నేటి తరం కూడా కొనసాగించటం గమనార్హం. కార్యక్రమంలో ఆలయచైర్మన్ మారుతి చంద్రమౌళి, బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, పంతంగి పవన్ కుమార్‌శర్మ, చిలుకూరి నాగమూర్తి, దేవులపల్లి సుధాకర్‌రావు, సాధు రాధాకృష్ణమూర్తి, అర్చకుడు శివయ్యతదితరులు పాల్గొన్నారు.

# మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రామారావు**

**'నషాముక్త్ భారత్'లో భాగంగా ర్యాలీ, ప్రతిజ్ఞ**







ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు, మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రమేష్, ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో రామారావు

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు లేని, వినియోగించని జిల్లాగా ఖమ్మాన్ని తీర్చిదిద్దాలని దీనికోసం ప్రతీఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.రామారావు కోరారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బందితో కలిసి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. 15 నుంచి 25 సంవత్సరాల యువత ఎక్కువగా ఈ వ్యసనానికి గురవుతుండటం అత్యంత ఆందోళనకరమన్నారు. ఈ కార్యక్రమంలో డెమో సుబ్రహ్మణ్యం, ఏవో డాక్టర్ మోతియా పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాలను అరికట్టటం ప్రతీ ఒక్కరి బాధ్యత**

ఖమ్మంఅర్బన్: మాదకద్రవ్యాల వాడకాన్ని అరికట్టటం ప్రతిఒక్కరి బాధ్యత అని మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు అన్నారు. నషాముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లు కళాశాల విద్యార్థులు, మునిసిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

**మెడికల్ కళాశాలలో**

ఖమ్మంమెడికల్ కళాశాలలోనూ నశాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా వాటిని నిరోధించాలని కళాశాలప్రిన్సిపాల్ శంకర్ కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్, వైస్‌ప్రిన్సిపాల్స్ సరిత, డాక్టర్‌రాజేశ్వరరావు, సృజన, అధ్యాపకులు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

**ఎక్సైజ్ సీఐ రమేష్**

నేలకొండపల్లి:విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ సుంకరి రమేష్ కోరారు. మంగళవారం నేలకొండపల్లి డిగ్రీకళాశాలలో జరిగిన మాదక ద్రవ్యాలపై అగాహనా కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ అవగాహన కలిగించారు. గుట్కాల ప్రభావం సైతం ఎక్కువైందని, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆలేటి పరంజ్యోతి, లెక్చరర్లు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి**



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఆఫీసర్ నాగేందర్‌రెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి:విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ నాగేందర్‌రెడ్డి అన్నారు. నషాముక్త్ భారత్ కార్యక్రమం ప్రారంభమై ఐదు సంవత్సరాల అయిన సందర్భంగా మంగళవారం నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీగణేష్, డీబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి, సూపర్ వైజర్ ఎం.నాగమణి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎం.సునంద, యాంటీడ్రగ్ కమిటీ కన్వీనర్ కరీం పాల్గొన్నారు.

## యూపీహెచ్‌సీల్లో మెడికల్ ఆఫీసర్ల భర్తీకి అభ్యంతరాల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని యూపీహెచ్‌సీల్లో నాలుగు మెడికల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీలో తుది ఎంపికలో అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు జిల్లావైద్యాధికారి డాక్టర్ డి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆగస్టు 26 నుంచి 30వరకు స్వీకరించినట్లు తెలిపారు. వాటిలో ఎంపిక చేసిన జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టామని వాటిపై అభ్యంతరాలను ఈనెల19 నుంచి21 వరకు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఆ తర్వాత తుదిజాబితానుహెచ్‌టీటీపీఎస్://ఖమ్మం.తెలంగాణ.జీవోవీ.ఇన్‌లో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు.

## వీధి కుక్క దాడితో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

కల్లూరు, నవంబరు18 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో గల హనుమతండాలోసోమవారం సాయంత్రం వీధికుక్క దాడిలో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు.గ్రామంలో ఓ వీధిలో ఇంటి ముందు ఉన్న ఏడాదిన్నర వయస్సు గల చిన్నారి బానోతు పల్లవిపై కుక్క దాడి చేయటంతో కుడిచేతి భాగంలో తీవ్ర గాయమైంది. అదే కుక్కనాలుగు సంవత్సరాల వయస్సు గల మరో చిన్నారి బానోతు ధామినిపై దాడిచేయటంతో నుదిటి భాగంలో తీవ్రంగా గాయమైంది. ధామిని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు తరలించారు. పల్లవిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతుందని తెలిసింది. స్థానికులు ఇద్దరు చిన్నారులపై కుక్క దాడి చేయగా గమనించి వెంబడించి తరిమివేయటంతో ఆ చిన్నారులు ప్రాణాలతో బయట పడ్డారని తెలిసింది. స్థానికులు కర్రలతో వెంటబడి కుక్కను చంపేశారు.

## పాడి రైతు కుటుంబానికి రూ.50వేల చెక్కు అందజేత

పెనుబల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని తిరువూరు క్లస్టర్ పరిధిలో తెలంగాణ రాష్ట్రంలోని సుబ్బాయిగూడెం అసోసియేషన్‌లోని పాడి రైతు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి మంగళవారం కృష్ణా మిల్క్ యూనియన్ అందించే క్షీరబంధు పథకం కింద మృతుడి భార్య జయలక్ష్మీకి రూ.50వేల చెక్కును అసోయేషన్ అధ్యక్షురాలు గోదారాణి, తిరువూరు క్లస్టర్ మేనేజర్ హెచ్.దిలీప్‌కుమార్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో కృష్ణా మిల్క్ యూనియన్ రూ.50వేలు అందజేయటం పట్ల మృతుడి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, సూపర్‌వైజర్ గోపిరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

## శివాలయంలో దయానంద్ పూజలు



దయానంద్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సత్తుపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా మంగళవారం మండలంలోని కాకర్లపల్లిలో కొలువుదీరిన శివాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించగా భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంచర్ల బాబూరావు, పువ్వాళ్ల ఉమా, కంచర్ల రమేష్, పొంగులేటి నరసింహారెడ్డి, గాదె చెన్నారావు, చల్లారి వెంకటేశ్వరరావు, ఎండీ.కమల్‌పాషా, జక్కంపూడి కిషోర్, రామప్పారావు పాల్గొన్నారు.

## పాఠశాలకు మెటీరియల్ వితరణ



మెటీరియల్, చెక్కును అందజేస్తున్న దృశ్యం

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ఖమ్మంలోని జోస్ అలుక్కాస్ బంగారుషాపు యాజమాన్యం రూ.1,72,640విలువైన బల్లలు, మైకొసెట్‌ను వితరణగా అందజేశారు. మంగళవారం జోస్ అలుక్కాస్ బ్రాంచ్ మేనేజర్ సిరిల్ మెటీరియల్‌తోపాటు చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగబత్తిని స్వప్న, ఉపాధ్యాయ బృందానికి విద్యార్థుల సమక్షంలో అందజేశారు. జోస్ అలుక్కాస్ వారికి పాఠశాల ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపింది.

## సీసీఐ నిబంధనలు ఎత్తివేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముదిగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో అధికారులు విధించిన నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌కు వినతిపత్రం అందజేశారు. మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిని నల్లబడిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతు భరోసా నిధులు రెండోసారి ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మభ్యపెడుతోందని విమర్శించారు. పోయిన సీజన్‌లో ధాన్యం అమ్ముకున్న రైతులకు రూ.500బోనస్ కూడా ఇవ్వలేదని, బోనస్ డబ్బులను ఇవ్వాలని కోరారు. నాయకులు కందుల భాస్కర్‌రావు, కోలేటి ఉపేందర్, బట్టు పురుషోత్తం, భద్రయ్య, రాయల శ్రీనివాస్, పయ్యావుల రామనాధం, రవి, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

## నిరుపేదలకీ ఇళ్లు ఇవ్వాలి

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని వైరా తహసీల్దార్ కేవీ. శ్రీనివాసరావుకు సీపీఎం నాయకులు ఒక వినతిపత్రం సమర్పించారు. మండలంలోని అష్ణగుర్తి గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి వివిధ దశల్లో అసంపూర్తిగా నిల్చిపోయిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు గ్రామసభ నిర్వహించారు. ఇండ్లకు లబ్ధిదారులుగా ఎంపిక చేసిన పేర్లను తహసీల్దార్ గ్రామసభలో ప్రకటించారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కోరుతూ సీపీఎం నాయకులు ఒక వినతిపత్రం సమర్పించారు. వైరా సొసైటీ ఉపాధ్యక్షుడు కొణిదన కోటేశ్వరరావు, సీపీఎం నాయకులు బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, చిత్తారు నాగరాజు, లక్ష్మణ్, కిలారు శ్రీనివాసరావు, బాజోజు రమణ పాల్గొన్నారు.

## నాయీ బ్రాహ్మణుల వనసమారాధన

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైరాలో మంగళవారం నాయీ బ్రాహ్మణుల వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైరా పరిసర ప్రాంతాలకు చెందిన నాయీ బ్రాహ్మణుల వన సమారాధనకు తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. నాయీ బ్రాహ్మణుల పెద్దలను సన్మానించారు. నాయీ సమైఖ్య సంక్షేమ సేవ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజ్జల వెంకన్న, దేవరకొండ శ్రీనివాస్, కుదురుపాక దర్గయ్య, మాదాల హరినాథ్, తూముల నాగభూషణం, ఆలేటి సత్యనారాయణ, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కారేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఏ.రమేష్, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ కోరారు. మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో కారేపల్లి మండల కేంద్రం, మాధారం గ్రామాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ.2389తోపాటు సన్నరకాల వరి ధాన్యానికి క్వింటాకు 500 రూపాయాలు బోనస్ చెల్లిస్తుదన్నారు. కేంద్రాల ప్రారంభానికి ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతవహించారు. కార్యాక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి బట్టు అశోక్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, మండలపార్టీ అధ్యక్షులు చంద్రప్రకాష్, జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, సీసీ గౌషియ బేగం, ఏఈవో ప్రమీల,ధాన్యం కొనుగోలు కేంద్ర నిర్వహకులు చీకుర్తి సుజాత, నాయిని కృష్ణవేణి, స్వరూప, భయ్యా జయ తదితరులు పాల్గొన్నారు.



కారేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

▸ సత్తుపల్లి డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ



సత్తుపల్లి డిపో గేట్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తితో పాటు శక్తిని క్షీణింపజేస్తూ శారీరకంగా, మానసికంగా కుంగదీస్తుందని సత్తుపల్లి ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో గేట్ వద్ద ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. మత్తు మాయలో పడిన విద్యార్థులు, యువత ఆరోగ్యాన్నే కాదు మానసిక ప్రశాంతతనూ కోల్పోతున్నారని, డ్రగ్స్ వల్ల విద్యార్థుల చదువులు ఆగమవుతున్నాయని, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. ముఖ్యంగా 25ఏళ్ల లోపు యువతే అధికంగా బానిసలవుతుండడం ఆందోళన కలిగిస్తోందని, ఈ మత్తు పదర్థాల వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపడంతోపాటు సమాజంలో కుటుంబ గౌరవం, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయని, మానసిక ఒత్తిళ్ల ప్రభావమో.. తోటి స్నేహితుల ప్రోద్భలమో.. కారణం ఏదైనా మత్తు మేఘాలు నేటి యువతను కమ్మేస్తున్నాయని, తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులు, యువత పట్ల శ్రద్ధ తీసుకుని వారిని సన్మార్గంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీ, వీటీవో కెన్నేర ఆనందరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



తల్లాడలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

### మత్తుపదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తల్లాడ: మత్తుపదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ కె.ప్రత్యూష సూచించారు. మంగళవారం తల్లాడలో మత్తు పదర్థాల అక్రమ రవాణ, వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆట్లాడుతూ.. కొంత మంది వ్యక్తులు అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలని విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి మత్తుపదార్థాలకు బానిసలుగా చేసి వారి ద్వారా రవాణ చేయించడం జరుగుతుందని వివరించారు. మత్తుపదార్థాల అక్రమరవాణ వినియోగాన్ని నివారించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు మౌనిక, శ్రీకాంత్, నీలిమ, హెల్త్ సూపర్‌వైజర్లు కె.పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

## వైరా బస్టాండ్‌లో చోరీ

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణీకుడి బ్యాగులోని రూ.1.80లక్షల నగదును దొంగలు కాజేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బస్టాండ్‌లో మధిర వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తున్న వాగు శ్రీనివాసరావు బ్యాగులోని నగదును చోరీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జొన్నలగడ్డకు చెందిన శ్రీనివాసరావు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. తన కుమారుడి పెళ్లి కార్డుల పంపిణీ కోసం హైదరాబాద్ నుంచి వైరా వచ్చారు. వైరాలో ఉన్న బంధువులకు పెళ్లి కార్డులు పంపిణీ చేసి మధిర వెళ్లేందుకు వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కి సీటులో కూర్చొని బ్యాగును పరిశీలించగా నగదు కన్పించలేదు. తమ గ్రామంలోని పంట రుణానికి సంబంధించిన రుణానికి సంబంధించి బ్యాంకులో జమ చేసేందుకు తీసుకువెళ్తున్న నగదు చోరీకి గురైంది. వెంటనే బస్‌స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసి సీసీ ఫుటేజీలను పరిశీలించాలని కోరారు. బస్టాండ్‌లోని సీసీ కెమెరాలు పనిచేయడం లేదని అక్కడి సిబ్బంది సమాధానం ఇచ్చారు. ఆతర్వాత వైరా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు.

## విద్యా ప్రమాణాలను పెంచాలి

వైరా, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎవరీ చైల్డ్ రీడ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాపుణ్యాలను పెంచాలని, ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఖమ్మంజిల్లాలో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు చేపట్టిన ఎవరీ చైల్డ్ రీడ్ కార్యక్రమం 14రోజులు గడిచిన సందర్భంగా తొలిసారి మంగళవారం కలెక్టర్ అనుదీప్, జడ్పీ సీఈవోతో కలిసి సందర్శించి పరిశీలించారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఉన్న యూపీఎస్ గుట్ట బడిని, రెబ్బవరంలోని ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమం అమలు గురించి ఆరా తీశారు. స్వయంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో బ్లాక్ బోర్డుపై రాయించటంతోపాటు పాఠ్యపుస్తకంలో ఉన్న విషయాలను చదివించారు. ఎవరీ చైల్డ్ రీడ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎంపీడీవో సక్రియా పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

## కొనుగోళ్లలో ఇబ్బందులు కల్గించొద్దు

ముదిగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గించవద్దని పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి చందన్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ముదిగొండ మండలం వల్లభి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్దతు ధరతోపాటు సన్నం బియ్యానికి ప్రభుత్వం రూ.500బోనస్ ఇస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి సన్నధాన్యం వచ్చే అవకాశముందని, పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం రవాణాకు సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, అక్రమ రవాణా అయితే కేసులు నమోదు చేయాలని, వాహనాలు సీజ్ చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టు నిర్వహణ రిజిస్ట్రర్లను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వల్లభి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఉన్న ధాన్యాన్ని ట్యాగ్ చేసి సంబంధిత మిల్లులకు రవాణా చేయాలని, రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు.

## అందుబాటులో లేని పశువైద్య సిబ్బంది

కారేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న పశువైద్యాశాలలో ఉండాల్సిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్యం కోసం పశువులు, మేకలు, గొర్రెలను తీసువచ్చే రైతులు వారే వైద్యం చేసుకుంటున్న వైనం మండల కేంద్రంలోని ప్రధాన పశువైద్యశాలలో చోటుచేసుకుంది. వైద్యశాలలో పని చేస్తున్న సిబ్బంది మంగళవారం లీవ్ పెట్టినట్లు చెప్పుతున్నారు, కాని ఎలాంటి లీవ్ పెట్టకుండ విధులకు డుమ్మాకొట్టారు. కారేపల్లి గ్రామానికి చెందిన ఎల్లంకి సాయి అనే వ్యక్తి తన గేదెకు వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకవచ్చాడు. ఆసుపత్రిలో వైద్యులు ఎవరు కనిపించకపోవడంతో నోటీస్‌బోర్డులో ఉన్న వైద్యుల నెంబర్లకు ఫోన్ చేశాడు. ఇందిర అనే వైద్యురాలు తను సెలవుపెట్టానని, అందుబాటులో లేను అని సమాధానం చెప్పడంతో, తన గేదెకు సూదివేయాలని, ఎలా అని వైద్యురాలును ప్రశ్నంచడంతో సాయి అనే వ్యక్తిపై సదరు వైద్యురాలు దురుసుగా మాట్లాడి ఫోన్ పెట్టేశారని, సాయి తెలిపాడు. మరో వైద్యురాలు శ్యామలకు ఫోన్ చేయగా తనకు జ్వరం వచ్చిందని, తాను రెండు రోజులు లీవ్ పెట్టానని తెలిపినట్లు తెలిపారు. ఇదే విషయంపై జిల్లా ఏడీని వివరణ కోరగా వైద్యాధికారి ఎలాంటి సెలవు పెట్టలేదని తెలిపారు. మండల వైద్యశాలలో అందుబాటులో ఉండి వైద్యసేవలు చేయాల్సిన వైద్యులు సిబ్బంది అందుబాటులో లేకుండా సెలవులు పెట్టామని లేనిపోని అబద్దాలు చెబుతున్న సిబ్బందిపై జిల్లా అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉండే వైద్యులను ఏర్పాటు చేయాలని, లేకుంటే తామంత కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని రైతులు ముక్తకఠంతో కోరుతున్నారు.



వైద్యం చేసుకుంటున్న రైతులు

## వీధి కుక్క దాడిలో చిన్నారులకు గాయాలు

కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో గల హనుమతండా గ్రామంలో సోమవారం సాయింత్రం వీధి కుక్క దాడితో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయడ్డారు. అందులో ఒకరి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా, మరో చిన్నారిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హనుమతండా గ్రామంలో ఓ వీధిలో ఇంటి ముందు ఉన్న ఏడాదిన్నర వయస్సు గల చిన్నారి బానోతు పల్లవిపై మందుగా ఓ వీధి కుక్క ఆకస్మాత్తుగా దాడి చేయగా కుడి చేతి భాగంలో తీవ్ర గాయమైంది. అదే కుక్క నాలుగు సంత్సరాల వయస్సు గల మరో చిన్నారి బానోతు ధామిని(4)పై దాడి చేయడంతో నుదిటి భాగంలో తీవ్రంగా గాయపడింది. ధామిని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించారు. స్థానికులు ఇద్దరు చిన్నారులపై కుక్క దాడి చేయగా గమనించి వెంబడించి తరిమి వేయడంతో ఆ చిన్నారులు ప్రాణాలతో బయట పడ్డారని తెలిసింది. హనుమతండాలో ఇద్దరు చిన్నారులపై ఒకే కుక్క దాడి చేయడంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు. ఈ సమయంలో సదరు కుక్కను స్థానికులు కర్రలతో వెంటబడి చంపారు.



చిన్నారులు ధామిని, పల్లవి

## తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

▸ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

బోనకల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిరప తోటల్లో తెగుళ్ల నివారణకు గానూ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుచరిత దేవి, పావని, చైతన్యలు సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారం వారు మిరప తోటలను పరిశీలించారు. ప్రస్తుత సీజన్‌లో మిరపలో కొమ్మ ఎండు, వేరు కుళ్ల తెగులు, నల్ల తామర పరుగులు పైరును ఆశించడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొమ్మ ఎండు తెగులు నివారణకు అజాక్సిస్ట్రోబిన్ లేదా ట్రిప్లాక్సిస్ట్రోబిన్ మందులను ప్లాంటోమైసిన్‌తో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. వేరు కుళ్ల తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడి కల్చర్‌ను విడిగా వాడాలని, లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా కాపర్ హైడ్రాక్సైడ్ మందులను ప్లాంటోమైసిన్ కలిపి మొక్క వేరు తడిచే విధంగా భూమిలో పోయాలన్నారు. వ్యవసాయాధికారులు ఏ.విష్ణు, పి. వినయ్, ఏఈవోలు పాల్గొన్నారు.

మధిరరూరల్: మధిర మండలం సిరిపురం, బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామాల్లో మిరప తోటలను మంగళవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యావనశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సుచరిత దేవి, డాక్టర్ పావని, చైతనయ, ఉద్యానవనశాఖ అధికారి వినయ్, మండల వ్యయవసాయ అధికారులు వినయ్, సాయిదీక్షిత్‌లు పంటపొలాలను పరిశీలించారు.



బ్రాహ్మణపల్లిలో మిరపతోటలను పరిశీలిస్తున్న సైంటీస్టులు

## అనుమతులు లేకుండా రక్తపరీక్షలు నిర్వహించొద్దు

▸ రికార్డులను పరిశీలించిన డీఎంహెచ్‌వో



ముదిగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా రక్తపరీక్షలు నిర్వహించవద్దని డీఎంహెచ్‌వో రామారావు ఆదేశించారు. మంగళవారం ముదిగొండలో ఆకస్మికంగా పర్యటించి పలు రక్తపరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అనుమతి లేకుండా రక్తపరీక్షలు నిర్వహిస్తే సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పీహెచ్‌సీని పరిశీలించి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆతర్వాత రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు రోగుల వివరాలను రిజిస్ట్రర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అరుణాదేవి, వైద్యసిబ్బంది రామారావు, మధుసూదన్‌రావు, లత, పద్మావతి, రమాదేవి, శారదా పాల్గొన్నారు.

## హంతకులను పట్టుకోవడంలో జాప్యమెందుకు

చింతకాని, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సామినేని రామారావు కేసు విషయం పక్కదారి పట్టించి పోలీసులు తమ యూనిఫాంను కోల్పోయే పరిస్థితి తెచ్చుకోవద్దని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు పేర్కొన్నారు. ఇటీవల హత్యకు గురైన చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు కుటుంబాన్ని ఆయన మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 50 సంవత్సరాలు ప్రజాజీవితంలో ఉన్న నాయకుడిని అత్యంత కిరాతకంగా హత్య చేయడం బాధాకరం. కాంగ్రెస్ ప్రభుత్వంలో హింసా రాజకీయం పెచ్చుమీరుతోందన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గంలో వరుస హత్యలు జరుగుతున్న ఎందుకు శాంతి భద్రతలను కాపాడలేకపోతున్నాడు. రామారావును హత్య చేసిన దోషులను చట్టం ముందు నిల్చోబెట్టి భట్టి తన నిబద్ధతను చూపాలన్నారు. పోలీసులు కేసును నీరుగార్చేందుకు విచారణను జాప్యం చేస్తున్నారని, పోలీస్ కమీషనర్‌కు కేసు విషయంలో చిత్తశుద్ధి లేదని, బాధ్యతయుతమైన పదవిలో ఉండి కాంగ్రెస్ పార్టీకి కొమ్ముకాస్తున్నాడన్నారు. అనంతరం నాగులవంచ గ్రామంలో ఇటీవల మృతిచెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, బొడ్డు వెంకటరామారావు, సామినేని అప్పారావు, గురిజాల హనుమంతరావు, తాత ప్రసాద్‌రావు, వంకాయలపాటి సత్యం, పర్సగాని ఏడుకొండలు, సీపీఎం నాయకులు రాచబంటి రాము, కొండ్రు జానకిరామయ్య, కాటబత్తిన వీరబాబు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తాత మధు

## జిల్లా స్థాయి ఖోఖో చాంపియన్స్‌గా మధిర విద్యార్థులు



మధిర రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్లూరు జడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన అండర్-17 బాలికల ఖోఖో పోటీల్లో మధిర మండల జట్టు అత్యుత్తమ ప్రతిభ కనపర్చి జిల్లా చాంపియన్‌లుగా నిలిచారు. ఈ విజయానికి కోచ్, మేనేజర్‌లుగా కోటి, సైదులు, ప్రవీణ్ కీలక పాత్ర పోషించారు. ఈ పోటీల్లో బాలికలు మొదటి బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ, మధిర మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.చిన్ని, వ్యాయామ ఉపాధ్యాయుడు చైతన్యలు విద్యార్థులను అభినందించారు.

## పోతురాజుకు సారస్వత పరిషత్ ఆహ్వానం

సత్తుపల్లిరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలసాహితీవేత్త ఆవుల పోతురాజుకు తెలంగాణ సారస్వత పరిషత్తు నుంచి ఆహ్వానం అందింది. ఈ నెల 23న శాంతా-వసంతా ట్రస్ట్ సౌజన్యంతో హైదరాబాద్‌లోని అబిడ్స్ వద్ద డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించే కోడూరు శాంతమ్మ స్మారక బాలల సాంస్కృతికోత్సవంలో పోతరాజు పాల్గొనున్నాడు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం వక్తృత్వం, పుస్తక సమీక్ష, దేశభక్తి గీతాలు, ఏకపాత్రాభినయం, వ్యాసరచన పోటీలు, సదస్సులు నిర్వహించనుండగా సత్తుపల్లిలోని బాలుర హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థి ఆవుల పోతురాజు స్వీయరచన 'నాన్నే నా హీరో' కథల సంపుటిపై సృజనానుభవాలను వివరించనున్నట్లు బొల్లేపల్లి-గార్లపాటి ట్రస్ట్ నిర్వహకులు మధుసూదనరాజు, రామకృష్ణలు మంగళవారం తెలిపారు. ఇది తనకు లభించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు, బాల అతిథిగా ఈ సదస్సులో సత్తుపల్లి నుంచి పాల్గొనడం నూతనోత్సాహాన్ని నింపనుందని, భవిష్యతులో మరిన్నీ రచనలతో అందరి మన్ననలు పొందాలనుకుంటున్నట్లు పోతురాజు తెలిపాడు.



ఆవుల పోతురాజు

## భవిష్యత్‌లో ఉద్యోగులకు పెన్షన్ వచ్చే అవకాశం లేదు

▸ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

బోనకల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే నూతన విద్యా విధానం వల్ల భవిష్యత్‌లో ఉద్యోగులకు పెన్షన్ వచ్చే అవకాశం లేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక రంజాన్ ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని రావినూతల గ్రామంలో మంగళవారం ఆ సంఘం 12వ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం రద్దు అయ్యేంత వరకు తమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. సీపీఎస్ విధానం రద్దు, విద్యారంగంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ తరువాత నెలలు గడిచినా ఇంత వరకు వారికి బెనిఫిట్స్ ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. సమస్యల పరిష్కారానికి పోరుబాట పడతామని హెచ్చరించారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా గుగులోతు రామకృష్ణ, అధ్యక్షుడిగా గార్లపాటి రంగారావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, నాయకులు నీలం లక్ష్మీనారాయణ, విజయలక్ష్మీ, శ్రీనివాసరావు, సదాబాబు పాల్గొన్నారు.




మహాసభలో మాట్లాడుతున్న షేక్ రంజాన్